# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 88 | విశాఖపట్నం | 28-12-2025 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 88 | VISAKHAPATNAM | 28-12-2025 SUNDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram







## కత్తి తీస్తే కటకటాలకే..

# వైసీపీకి అనిత హెచ్చరిక



**అమరావతి, పతాకం న్యూస్:** మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తల వికృత చేష్టలపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా అని ప్రశ్నించారు. నడిరోడ్లపై అకారణంగా మూగజీవాల ఉసురు తీసి బలులు, రక్తాభిషేకాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ సైకో మూక వికృత చేష్టలు చూస్తుంటే మానవత్వం ఉందా లేదా అనిపిస్తోందన్నారు. అధికారం కోల్పోయిన తరువాత కూడా రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ ముఠా ఎంతకైనా దిగజారుతోందని వ్యాఖ్యలు చేశారు. మూగ జీవాలను బలి తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వైసీపీ పార్టీ ఉన్మాదాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, కుప్పం, గోపాలపురం... ఇలా పలుచోట్ల మేక తలలు నరికి బహిరంగంగా నెత్తురు చల్లిన సంఘటనలు ఉన్నాయన్నారు. మీరు చేస్తున్నది తప్పు అని చెప్పిన గర్భిణీ స్త్రీ మీద వైసీపీ మూక ఉన్మాదుల మాదిరి దాడులు చేశారని ఫైర్ అయ్యారు. గర్భిణి మీద వైసీపీ సైకో దాడి జరిగితే ఈ రోజు వరకు జగన్మోహన్ రెడ్డి తప్పు అని ఖండించలేదన్నారు. గర్భిణీపై దాడి చేసిన కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని మరో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అతను జనసేన కార్యకర్త అయితే జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో ఎందుకు (తరువాయి 2వ పేజీలో)

## జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై

# సీఎం చంద్రబాబు సమీక్ష



- జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయా లకు పెద్దపీట
- పలు జిల్లాలు, డివిజన్ల సరిహద్దుల్లో కీలక మార్పులు చేర్పులు
- 31న తుది నోటిఫికేషన్ జారీకి సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని, కొన్ని స్వల్ప మార్పులతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఈ నెల 31వ తేదీన జిల్లాల పునర్విభజనపై తుది నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం మూడు కొత్త జిల్లాలు, ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాటు పలు మార్పులతో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై నెల రోజుల పాటు ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు అందాయి. ఈ నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, ప్రజాభీష్టానికి అనుగుణంగా కొన్ని ముఖ్యమైన మార్పులకు ఆమోదం తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన డిమాండ్‌ను గౌరవిస్తూ, గూడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇది ప్రభుత్వానికి ప్రజాభిప్రాయంపై ఉన్న గౌరవాన్ని సూచిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్ స్థానంలో అడ్డరోడ్డు జంక్షన్‌ను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో, అచ్యుతాపురం మండలాన్ని కొత్తగా ఏర్పడనున్న అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చనున్నారు. మార్కాపురం జిల్లా పరిధిలోకి దొనకొండ, కురిచేడు మండలాలను తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించారు. రంపచోడవరం కేంద్రంగా ఏర్పాటు కానున్న పోలవరం జిల్లా విషయంలో మాత్రం ఎలాంటి మార్పులు చేయకుండా, ప్రాథమిక నోటిఫికేషన్ ప్రకారమే యధావిధిగా కొనసాగించాలని సీఎం సూచించారు. (తరువాయి 2వ పేజీలో)

## కృష్ణా జిల్లాను క్రీడా కేంద్రంగా

# మారుస్తాం : రవీంద్ర



**కృష్ణా, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లాను క్రీడలకు కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం నేషనల్ కాలేజీ మైదానంలో బందరు ఓల్డ్ క్రికెటర్స్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ 2025ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా టోర్నీ నిర్వహించడం అభినందనీయ మన్నారు. మసులా బీచ్ ఫెస్టివల్లో నేషనల్ బీచ్ వాలీ బాల్ పోటీల్లో దేశ విదేశాల నుండి క్రీడాకారులు వచ్చారని తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అంబటి రాయుడు ఆధ్వర్యంలో ఏపీలో ఒక క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మచిలీపట్నంలో క్రికెట్ అభివృద్ధికి ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. స్థానికంగా పిల్లలకు సరైన గ్రౌండ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీలైనంత త్వరగా మచిలీపట్నం క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది అని అన్నారు. జాతీయ స్థాయిలో క్రికెటర్లు వచ్చేలా బందరులో సదుపాయాలు కల్పిస్తామన్నారు. మసులా స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేసి క్రీడలను ప్రోత్సహిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఏఎంసి చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, లంకె నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**అమరావతి, పతాకం న్యూస్:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్‌ను డిసెంబర్ 31న లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో ప్రభుత్వం పింఛన్లకు సంబంధించి ఈ ఆదేశాలు జారీ చేసింది. పింఛన్లకు సంబంధించిన నగదును డిసెంబర్ 30వ తేదీనే బ్యాంకుల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విత్‌డ్రా చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.



సిజేరియన్ ప్రసవాలు పెరగడానికి కారణాలివే!

6లో

మొబైల్ తయారీలో భారత్ దూకుడు...



7లో






## ఎన్టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలపాలి: సత్యకుమార్

**విజయవాడ, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా పాలనలోనూ, సేవల పంపిణీలోనూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ స్ఫూర్తితో పని చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో ఉన్న జిల్లా ఇరిగేషన్ కాంపౌండ్ రైతు శిక్షణ కేంద్రంలో మంత్రి ఆధ్వర్యంలో డీఆర్‌సీ సమావేశం జరిగింది. గత డీఆర్‌సీ సమావేశంలో లేవనెత్తిన వివిధ అంశాలపై తీసుకున్న చర్యలను చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన సత్యకుమార్ అభివృద్ధి పనుల టెం డర్ల ప్రక్రియతో పాటు డీపీఆర్‌ల సత్వర రూపకల్పనపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పథకాల అమలుతోపాటు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ఎన్టీఆర్ జిల్లాను (తరువాయి 2వ పేజీలో)



పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పరిశ్రమల్లో రక్షణ డొల్ల!

దేశంలోని పరిశ్రమల్లో భద్రతా చర్యలపై తగిన శ్రద్ధ తీసుకోకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. అత్యధిక ప్రమాదాలు, మరణాలు రసాయన కంపెనీల్లో చోటు చేసుకుంటున్నాయి. పరిశ్రమాధిపతుల కోసం ప్రభుత్వాలు పరిశ్రమల తనిఖీ, కార్మికుల భద్రత, రక్షణ వంటి అంశాలపై పని చేసే వ్యవస్థలను బలహీనం చేయడంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. దేశంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ లలో ఈ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. 2022లో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) నిర్వహించిన అధ్యయనంలో గడచిన రెండున్నర సంవత్సరాల్లో దేశంలో 130కి పైగా జరిగిన రసాయన ప్రమాదాల్లో 218 మరణాలు సంభవించగా, 300 కంటే ఎక్కువ మంది గాయపడ్డారని గుర్తించింది. గత ఐదేళ్లలో ఎ.పి లో సుమారు 119కి పైగా జరిగిన ప్రమాదాల్లో 150 మంది మృతి చెందినట్లు వసుధ మిశ్రా కమిటీ తెలిపింది. భద్రతకు పరిశ్రమాధిపతులు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు చోటుచేసుకుంటున్నాయని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకటించింది. అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని 138 ఔషధ, రసాయన పరిశ్రమల్లో 40 వేల మంది, ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్.ఇ.జెడ్)లో మరో 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అచ్యుతాపురంలోని అసెన్షియ కంపెనీలో ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగినట్లు పరిశ్రమల తనిఖీ ఇన్‌స్పెక్టర్ల విచారణలో తేలింది. బెయిల్‌పై బయటకు వచ్చేలా కంపెనీ యాజమాన్యంపై 106(1),125(బి), 125(ఎ) సెక్షన్ల కింద పోలీసు కేసు నమోదుచేశారు. సేఫ్టీ ఆడిట్ క్రమం తప్పకుండా నిర్వహించి, లోపాలను సరిదిద్దేలా చూడాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యత, పర్యవేక్షణ నుంచి తప్పుకొని యజమానుల కొమ్ము కాసే విధానాలు అమలు చేస్తోంది. అనుమతుల జారీకి కాలపరిమితి విధించి ఎటువంటి తనిఖీలు చేయకుండా, భౌతిక పరిశీలన లేకుండా అనుమతులు ఇచ్చే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకు తెచ్చింది. ఉత్పత్తి క్రమంలో ప్రమాదాలు జరగకుండా తగిన నియంత్రణా చర్యలు చేపట్టని యాజమాన్యాలపై కనీస చర్యలు తీసుకొనే అవకాశం లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయి. తాజాగా లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులకు హక్కుల్లేకుండా మోడీ ప్రభుత్వం చేసింది. ఆ యా శాఖలకు భద్రతపై పర్యవేక్షించే అధికారాలను కత్తిరించింది. అన్ని వైపుల నుంచి కార్మికులపై దాడికి దిగి, కార్పొరేట్ సంస్థలు, ధనికులకు లాభాలు చేకూర్చేందుకు నేనున్నానని ప్రభుత్వం భరోసా ఇస్తుంది. కార్మికుల ప్రాణాలకు ఏ విలువా లేనట్లు, వారు మనుషులు కానట్లు చూస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేయాల్సిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై కూడా ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు ఆడిట్ నిర్వహించాలి. గుర్తించిన లోపాలను సరిచేయాలి. కార్మికులకు ప్రతీ పరిశ్రమలో భద్రతా పరికరాలు ఇచ్చేలా ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ పెరగాలి. భద్రతకు ప్రాధాన్యత ఇవ్వని పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి. పని ప్రదేశంలో విద్యార్హతలు కల్గిన నైపుణ్య కార్మికులను నియమించాలి. భద్రతపై చర్యలు తీసుకోని ఫలితంగా ప్రమాద ముప్పు కార్మికులపై పొంచి వుంది. ప్రమాదకర రసాయనాల విడుదలతో ఏ చిన్న ప్రమాదం జరిగినా కార్మికుల ప్రాణాలు పోతున్నాయి. వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రసాయనాల శుద్ధిపై దృష్టి పెట్టక పోవడంతో నేల, గాలి, నీరు కలుషితమై ప్రజలు జబ్బుల పాలవుతున్నారు. పారిశ్రామిక ప్రమాదాల నివారణకు నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సూచనలు అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో పరిశ్రమల తనిఖీ శాఖలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల ఖాళీలను భర్తీ చేసి తనిఖీలు పెంచాలి. పరిశ్రమలో ప్రమాదాలకు యాజమాన్యాన్ని బాధ్యులను చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి. వలస కార్మికుల వివరాలను తహశీల్దార్ కార్యాలయంలో నమోదు చేయాలి. 8 గంటలకు మించి ఉచితంగా పని చేయించుకుంటున్న యజమానులపై కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాలి. పరిశ్రమలలో పర్మినెంట్ కార్మికుల నియామకాలు చేపట్టాలి. కార్మికులు అప్రమత్తమై తమకు జరుగుతున్న అన్యాయంపై సంఘటితం కావాలి. హక్కుల రక్షణ, సాధనకు ఐక్యంగా పోరాడాలి.

## సంక్రాంతి సెలవుల తేదీలు వచ్చేశాయ్ స్కూల్ పిల్లలకు పెద్ద పండగే!



**అమరావతి, పతాకం న్యూస్:** : రాష్ట్రంలో పెద్ద పండుగ సంక్రాంతి వేళ స్కూల్ విద్యార్థులకు మరిన్ని సంబరాలు తీసుకొస్తోంది. రోజూ సాయంత్రం లాంగ్ బెల్ మోగుతోందంటే చాలు! పరుగు పరుగున ఇంటికి వెళ్లే పిల్లలు ఆదివారం వస్తోందంటే ఇక ఆనందంతో గంతులు వేస్తుంటారు. ఆటపాటల్లో మునిగితేలుతుంటారు. అలాంటి వారికి ఈ సారి సంక్రాంతికి 9 రోజులు సెలవులు తీసుకువస్తోంది. తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి సెలవులు 10 నుంచి 15 వరకు అంటే కేవలం 4 రోజులే ప్రకటించింది. ఇందులో 10 వ తేదీ రెండో శనివారం, 11 ఆదివారం వచ్చాయి. అంటే అదనంగా నాలుగు రోజులు మాత్రమే ప్రకటించగా ఏపీలో జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు రానున్నాయి. దీంతో మొత్తం 9 రోజులు పండగ సెలవులు వస్తున్నాయి. సంక్రాంతి పండుగ సంబరాలకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఇక్కడ జరుపుకొనే సంబరాలు ఆకాశాన్నంటుతుంటాయి. నోరూరించే పిండి వంటలు, వివిధ రకాలైనా ఆహార పదార్థాలు, కొత్త అల్లుళ్లకు పసందైన విందు భోజనాలు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉంటాయి. వీటికి అదనంగా ప్రభలు, కోడి పందేల నిర్వహణతో ఊరూరా కోలాహలం ఉంటుంది. అతి పెద్ద పండుగ కావడంతో దేశ విదేశాల్లో స్థిర పడిన లక్షలాది మంది సంక్రాంతికి ఇక్కడకు రావడం ఆనవాయితీ. ఉద్యోగం, ఉపాధి, వ్యాపార రీత్యా దేశం నలుమూలల ఎక్కడెక్కడో స్థిర పడిన వారంతా తిరిగి సొంతూళ్లో కలుసుకుంటుంటారు. అందుకు తగ్గట్లుగానే దాదాపు పది రోజులు ఇక్కడే ఉండేలా బంధుమిత్రులంతా ప్లాన్ చేసుకుంటుంటారు. దీంతో పల్లెల్లో కోలాహలం అంతా ఇంతా కాదు. ఊరూ, వాడా పండుగ సందడి నెలకొననున్న నేపథ్యంలో విద్యాసంస్థలకు 9 రోజులు సెలవులు రావడం ప్రాధాన్యమిస్తోంది. 2025-26 అకడమిక్ క్యాలెండర్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జనవరి 10 నుంచి 18 వరకు సెలవులు ప్రకటించింది. జనవరి 19 సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం కానున్నాయి. సెలవుల అనంతరం జనవరి 19వ తేదీన పాఠశాలలు యథావిధిగా ప్రారంభమవుతాయని, సెలవుల కారణంగా అకడమిక్ క్యాలెండర్‌లో, పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని విద్యాశాఖ స్పష్టం చేసింది. సంక్రాంతి పండగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి ఏపీ, ఏపీ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు పూర్తిస్థాయిలో బుకింగ్ పూర్తయ్యాయి. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, నెల్లూరు సహా ఉభయగోదావరి జిల్లాలకు చెందిన తెలుగు వారు ఎక్కువగా హైదరాబాద్ నుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. సాధారణ రోజుల్లోనే రద్దీ ఉండే ఈ రూట్లలో ఇక పండుగ రోజుల్లో రిజర్వేషన్లు ఇప్పటికే పూర్తయ్యాయి. రోజూ సాధారణ, ప్రత్యేక, వారపు రైళ్లు 120కి పైగా నడుస్తుండగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రద్దీ సంక్రాంతికి పెరగనుండడంతో ఇప్పటికే 8 ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టగా వీటిలోనూ ముందస్తు రిజర్వేషన్లు పూర్తయ్యాయని అధికారులు చెప్పున్నారు.

## నర్సీపట్నంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు

### స్పీకర్ అయ్యన్న చేతులమీదుగా కరపత్రం ఆవిష్కరణ



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** సంక్రాంతి పండుగను పురస్క రించుకుని నర్సీపట్నంలో నిర్వ హించనున్న మండల స్థాయి కబడ్డీ పోటీల కరపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపా త్రుడు శనివారం తన క్యాంప్ కా ర్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, నర్సీపట్నంలోని వెలమవీధి కమిటీ ఆధ్వర్యంలో కీ.శే. రుత్తల లచ్చపాత్రుడు జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 12, 2026 నుండి 14వ తేదీ వరకు స్థానిక పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ కబడ్డీ పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులుగా మొదటి బహుమతి రూ. 20,000, రెండవ బహుమతి రూ. 15,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, ఆసక్తి గల జట్లు కమిటీ సభ్యులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో వెలమవీధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లాను ముందు వరుసలో నిలపాలి: సత్యకుమార్

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని, కొన్ని స్వల్ప మార్పులతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఈ నెల 31వ తేదీన జిల్లాల పునర్విభజనపై తుది నోటిఫికేషన్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత నెల 27న రాష్ట్ర ప్రభుత్వం మూడు కొత్త జిల్లాలు, ఐదు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాటు పలు మార్పులతో ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై నెల రోజుల పాటు ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 927 అభ్యంతరాలు, సూచనలు అందాయి. ఈ నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం, ప్రజాభీష్టానికి అనుగుణంగా కొన్ని ముఖ్యమైన మార్పులకు ఆమోదం తెలిపింది. ప్రజల నుంచి వచ్చిన తీవ్రమైన డిమాండ్‌ను గౌరవిస్తూ, గూడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలను తిరిగి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇది ప్రభుత్వానికి ప్రజాభిప్రాయంపై ఉన్న గౌరవాన్ని సూచిస్తోందని పలువురు అభిప్రాయపడు తున్నారు. అదేవిధంగా, అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్ స్థానంలో అడ్డరోడ్డు జంక్షన్‌ను కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి డివిజన్‌లో, అచ్యుతాపురం మండలాన్ని కొత్తగా ఏర్పడనున్న అడ్డరోడ్డు జంక్షన్ డివిజన్‌లో చేర్చనున్నారు.

## రాజధాని రైతు సమస్యలపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశం



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధానికి భూములిచ్చిన రైతులకు 30 ఏళ్ల లింక్ డాక్యుమెంట్లు అడగకుండా రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లు అంగీకరించారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి సీఆర్డీఏ ఇచ్చే డాక్యుమెంట్ ఆధారంగానే రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఒప్పుకున్నారన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో దాదాపు 10 వేల మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాంట్రాక్ట్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని ఇప్పటి వరకూ 1,600 మందికి ఉపాధి కలిగేలా చూశామన్నారు. రానున్న రోజుల్లో 35 వేల మంది ఇక్కడ పని చేసే అవకాశం ఉన్నందున నైపుణ్య శిక్షణ ద్వారా వారికి ఉపాధి లభించేలా కాంట్రాక్ట్ సంస్థలతో అవగాహన కుదుర్చుకున్నామని మంత్రి వెల్లడించారు. మంగళగిరిలోని సీఆర్డీఏ కార్యాలయంలో రాజధాని రైతు సమస్యల పరిష్కారంపై త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించారు. సమీక్షకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. దాదాపు 3 గంటల పాటు వివిధ అంశాలపై చర్చించారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. జరీబ్ భూముల సమస్యపై సర్వే పూర్తి చేశామన్న ఆయన, కమిటీ నివేదిక ఆధారంగా జరీబ్ భూమి రైతులకు న్యాయం చేస్తామని మంత్రి పెమ్మసాని హామీ ఇచ్చారు. లంక భూముల రిజిస్ట్రేషన్?కు సంబంధించి ఇంకా నమోదు చేసుకోవాల్సి ఉన్న 277 మంది త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అసైన్డ్ భూములకు సంబంధించి న్యాయపరంగా తలెత్తే ఇబ్బందులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజధాని గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి డీపీఆర్?లు పూర్తైనందున మొదటి వారంలో పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రతీ గ్రామంలో కమ్యూనిటీ హాల్, శ్మశానాల ఏర్పాటు ప్రక్రియకు చర్యలు చేపట్టామన్నారు. జగన్ ప్రభుత్వం తొలగించిన 4వేల పైచిలుకు పింఛన్లను పునరుద్ధరించేందుకు దరఖాస్తులు స్క్రూటినీ చేస్తున్నామన్నారు. రాజధానికి భూమి ఇచ్చిన వారికి హెల్త్ కార్డులు ఇచ్చే అంశంపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. ఎన్8 సమావేశంలో అనారోగ్యంతో చనిపోయిన రైతు రామారావు పట్ల వైఎస్సార్సీపీ శవరాజకీయాలు చేయటం దుర్మార్గమని మండిపడ్డారు. రామారావు కుటుంబసభ్యుల మనోభావాలు దెబ్బతీసేలా వైఎస్సార్సీపీ చేసే శవరాజకీయాలను శ్రావణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు.ప్రతీ గ్రామంలో కమ్యూనిటీ హాల్, శ్మశానాల ఏర్పాటు ప్రక్రియకు చర్యలు చేపట్టామన్నారు. జగన్ ప్రభుత్వం తొలగించిన 4వేల పైచిలుకు పింఛన్లను పునరుద్ధరించేందుకు దరఖాస్తులు స్క్రూటినీ చేస్తున్నామన్నారు. రాజధానికి భూమి ఇచ్చిన వారికి హెల్త్ కార్డులు ఇచ్చే అంశంపై కసరత్తు జరుగుతోందని తెలిపారు. ఎన్8 సమావేశంలో అనారోగ్యంతో చనిపోయిన రైతు రామారావు పట్ల వైఎస్సార్సీపీ శవరాజకీయాలు చేయటం దుర్మార్గమని మండిపడ్డారు. రామారావు కుటుంబసభ్యుల మనోభావాలు దెబ్బతీసేలా వైఎస్సార్సీపీ చేసే శవరాజకీయాలను శ్రావణ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. రైతులకు 30ఏళ్ల లింక్ డాక్యుమెంట్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. రిటర్నబుల్ ప్లాట్లకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఒప్పుకున్నారు. రాజధాని పనుల్లో దాదాపు 10వేల మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్ట్ సంస్థల ఒప్పందంతో 1,600మందికి ఉపాధి కల్పించామని మంత్రి పెమ్మసాని తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

## సీఎం చంద్రబాబు సమీక్ష

విస్తీర్ణంలో చాలా పెద్దదిగా ఉన్న ఆదోని పట్టణాన్ని రెండు మండలాలుగా విభజించాలనే ప్రతిపాదనపై కూడా సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మరోవైపు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో, రాయచోటిని మదనపల్లి జిల్లాలో, రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలో కలపడంపై చర్చ జరిగినప్పటికీ, దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ఈ ప్రాంతాలు యథావిధిగానే...

శ్రీకాకుళం జిల్లాలోని నందిగం మండలాన్ని పలాస డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చడం. అనకాపల్లి జిల్లాలోని చీడికాడ మండలాన్ని నర్సీపట్నం డివిజన్ నుంచి అనకాపల్లి డివిజన్‌కు మార్చడం. కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దాపురం డివిజన్‌కు మార్చడం. అద్దంకి రెవెన్యూ డివిజన్‌లోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె. పంగులూరు, కొరిసపాడును ప్రకాశం జిల్లాలోకి మార్పు చేయడం. కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని మర్రిపూడి, పొన్నలూరు మండలాల్ని కందుకూరు రెవెన్యూ డివిజన్‌లోకి మార్పు... ప్రకాశం జిల్లాలో విలీనం. కందుకూరు డివిజన్‌లోని 5 మండలాలను ప్రకాశం జిల్లాకు మార్చడంతో పాటు... కందుకూరు డివిజన్‌లోని మిగిలిన రెండు మండలాలు అయిన వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లోకి మార్పు... పలమనేరు డివిజన్‌లోని బంగారుపాలెం మండలాన్ని చిత్తూరు డివిజన్‌కు మార్పు. చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని చౌడేపల్లి, పుంగనూరును మదనపల్లి రెవెన్యూ డివిజన్‌కు మార్చడం. చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని సదుం, సోమలను మదనపల్లి జిల్లాలోని పీలేరు రెవెన్యూ డివిజన్‌కు మార్పు. శ్రీ సత్యసాయి జిల్లాలో కొత్తగా మడకశిర రెవెన్యూ డివిజన్ ఏర్పాటు. కదిరి రెవెన్యూ డివిజన్‌లోని ఆమదగురు మండలాన్ని పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో విలీనం. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ మార్పుచేర్పుల తర్వాత ఈ డిసెంబర్ 31న తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయనుంది. సమీక్షా సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, అనిత, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వైసీపీకి అనిత హెచ్చరిక

పాల్గొంటారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి రాజకీయ పబ్బం కోసం 20 ఏళ్ళ లోపు యువతని బలితీసుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్ర యువత భవితను నాశనం చేశారని.. ఇప్పుడు రప్పా రప్పా అంటూ వైసీపీ ముఠా యువతను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రప్పా రప్పా అంటే జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు. కత్తి తీస్తే కటకటాలపాలవడం ఖాయమని వైసీపీ మూక గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఇది రాక్షసుడు నడిపే ఆటవిక వైసీపీ పాలన కాదని.. శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే చంద్రన్న నాయకత్వంలో నడిచే కూటమి ప్రభుత్వ పాలన అని అన్నారు. ఈ ప్రభుత్వం రాష్ట్రంలో ఎటువంటి హింసను సహించదని, ఉపేక్షించదని హోంమంత్రి అనిత తేల్చిచెప్పారు.

# రూ.6.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



**గాజువాక, పతాకం న్యూస్:** ప్రజలకు మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వము యొక్క ప్రధమ ధ్యేయమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన 6వ జోన్ (గాజువాక) 70 వార్డు పరిధిలో సుమారు రూ.6.50 కోట్ల జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గాజువాక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ల తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక ను అభివృద్ధి చేసేందుకు శాసనసభ్యులతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. అందులో భాగంగా జీవీఎంసీ నిధులతో 70వ వార్డులో పరిధిలోని శ్రామిక నగర్, ఎల్. వి.నగర్, డ్రైవర్స్ కాలనీ, శ్రీనివాస నగర్, ఎర్రగెడ్డ కాలనీ, ఎల్.బి.ఎస్. నగర్, గోవింద గిరి నగర్, పద్మజ హాస్పిటల్, శ్రీనిధి అపార్ట్మెంట్, దాసమ్మ కొండ కాలనీ, టివిఎన్ కాలనీ, శక్తివానిపాలెం తదితర ప్రాంతాలలో సిసి రోడ్లు, కాలువలు, మెట్లు, బిటి హాట్ మిక్స్ రోడ్లు, ఎస్ డబ్ల్యు డ్రైన్, జిమ్ము, పలు తాగునీటి పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేసామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం విశాఖను అభివృద్ధి పథంలో నడిపేందుకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమము, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేయడం జరుగుతుందని, పారిశ్రామికవాడ అయిన గాజువాక ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు నిరంతరం కృషి చేస్తూ, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి వార్డులోనూ చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. 70 వార్డు పరిధిలో సుమారు 6.5 కోట్ల రూపాయలతో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించేందుకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులపై కెమెరా కన్ను



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరం మొత్తం సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయినట్టు రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్సీహెచ్ శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు. ఇకపై వాహనాల కదలికలన్నీ ఆటోమేటిక్‌గా ఏఐ ఆధారిత ఆటోమేటిక్ కెమెరాల్లో రికార్డవుతాయన్నారు. ఆ సీసీ ఫుటేజీ రవాణా శాఖ వెబ్‌సైట్‌కు లింక్ చేసి ఉంటుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్టయితే సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ లాగిన్ ద్వారా చలానాలు జారీ అవుతాయని పేర్కొన్నారు. చలానాలో ఉండే 'ప్లేస్ ఆఫ్ చెకింగ్' వద్ద స్థలం నమోదవుతుందన్నారు. వాహనదారులు పూర్తి అప్రమత్తంగా రోడ్లపై వాహనాలు నడుపుతూ, సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

## పంచ గ్రామాల భూ సమస్యకు

# పరిష్కారమెన్నడో?



**సింహాచలం, పతాకం న్యూస్:** సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూ సమస్య 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అనే చందంగా ఉంది. ప్రజలు ఆక్రమించుకున్న భూములకు ప్రత్యామ్నాయంగా భూములు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించి ఏడాది కావస్తోంది. దీనికి దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు సూత్రప్రాయంగా అంగీకరించారు. ప్రతిపాదన సమ్మతమేనంటూ దేవదాయ శాఖ ద్వారా హైకోర్టుకు నివేదిక సమర్పించారు. అక్కడే కేసు ఆగిపోయింది. అనుకూలంగా నిర్ణయం వస్తుందా?...అనే దానిపై అనుమానాలు ఉన్నాయి. %అడవివరం, పురుషోత్తపురం, చీమలాపల్లి, వెంకటాపురం, వేపగుంటలను పంచ గ్రామాలుగా వ్యవహరిస్తున్నారు. జమిందారీ చట్టం రద్దు అయినప్పుడు ఈ గ్రామాల్లో తమకు వంశపారంపర్యంగా వచ్చిన భూములను విజయనగరం రాజులు సింహాచలం దేవస్థానానికి రాసిచ్చేశారు. ఈ ఐదు గ్రామాలు భీమిలి, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. దేవస్థానం భూముల్లో కొన్ని దశాబ్దాల క్రితం రైతులు తోటలు వేసుకొని జీవనోపాధి పొందేవారు. నగరం విస్తరించడంతో వారి నుంచి కొందరు ఆ భూములను కొనుగోలు చేశారు. మరికొందరు ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. వాటిని క్రమబద్ధీకరణ చేయాలని కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నం జరుగుతోంది. 2008లో సర్వే నిర్వహించి 12,149 నిర్మాణాలు ఉన్నాయని, వాటి విస్తీర్ణం 420 ఎకరాలుగా నిర్ధారించారు. తెలుగుదేశం ప్రభుత్వం అప్పట్లో వీటిని క్రమబద్ధీకరించేందుకు ముందుకొచ్చింది. ప్రాంతాల వారీగా భూమి ధర నిర్ణయించి, ఆక్రమించిన స్థలానికి దేవస్థానానికి డబ్బులు చెల్లించాలని 578 నంబరుతో జీఓ ఇచ్చింది. అప్పుడు సుమారు 6,110 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తులు సమర్పించారు. కొన్నింటినే అధికారులు ప్రాసెస్ చేశారు. ఆ సమయంలో న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు కావడంతో మిగిలినవి పెండింగ్‌లో ఉండిపోయాయి. రాష్ట్ర విభజన తరువాత 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తొలి కేబినెట్ మీటింగ్ పెట్టినప్పుడు ఈ అంశంపై చర్చించింది. దేవస్థానానికి ప్రత్యామ్నాయంగా 547 ఎకరాలు ఇస్తామని ప్రతిపాదించింది. దేవస్థానం ధర్మకర్త అశోక్‌గజపతిరాజు అంత సుముఖత వ్యక్తంచేయలేదు. ఆ తరువాత మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు ప్రారంభించింది. విశాఖ నగర శివార్లలోనే భూములు ఇస్తామని మరో ప్రతిపాదన చేసింది. దీనికి ఈసారి అశోక్‌గజపతిరాజు అంగీకారం తెలిపారు. దేవదాయ శాఖ ద్వారా హైకోర్టులో సమ్మతమేనంటూ నివేదిక సమర్పించారు. న్యాయస్థానం తీర్పు కోసం వేచి ఉన్నామని ప్రజా ప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు.

## సీపీఎం నేత అప్పలరాజుపై పీడీ యాక్ట్ రద్దుకు డిమాండ్



**నర్సీపట్నం, పతాకం న్యూస్ :** నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, కోట్ల రూపా యలు ఖర్చుచేసి విశాఖలో పరిశ్రమల సమ్మేళనాలు నిర్వహిస్తున్నా ఒక్కరికైనా ఉపాధి కలిగిందా అని ప్రశ్నించారు. ఆ నిధులతో నర్సీపట్నం, పాడేరు మెడికల్ కళాశాలలు పూర్తి చేయవచ్చని అన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వ కనీస బాధ్యతని, కార్పొరేట్లకు మేలు చేసే విధానాలను సీపీఎం ఖండిస్తోందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయకృష్టన్ కు వినతిపత్రం అందజేస్తూ, ప్రజల సమస్యలపై పోరాడుతున్న అప్పలరాజుపై పీడీ యాక్ట్ విధించడం అన్యాయమని, వెంటనే రద్దుచేసి బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విడుదల చేయకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని సీపీఎం నేతలు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాదం, జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నర్సీపట్నం నియోజకవర్గాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: స్పీకర్ అయ్యన్న



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం నియోజకవర్గాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.2 కోట్ల 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రసూతి నిరీక్షణ కేంద్రం (బర్త్ వెయిటింగ్ హాల్) కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ కె.వి.ఎల్.పి రాజు పాల్గొన్నారు. అనంతరం రూ.35 లక్షల విలువైన అత్యాధునిక టిఫా స్కానింగ్ మిషన్ ను స్పీకర్ అయ్యన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 1985లో ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు వేలాది మందికి సేవలందిస్తోందని తెలిపారు. నర్సీపట్నం ఆసుపత్రిపై నమ్మకంతో తుని, పాడేరు వంటి దూర ప్రాంతాల నుంచి కూడా గర్భిణీలు ఇక్కడికి వస్తున్నారని పేర్కొన్నారు. చివరి నిమిషంలో ఆసుపత్రికి రావడం వల్ల ఏర్పడే ప్రమాదాలను నివారించేందుకే ఈ ప్రసూతి నిరీక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.డెలివరీ తేదీకి రెండు రోజుల ముందే గర్భిణీలు ఆసుపత్రిలో ఉండేలా ఈ భవనాన్ని రూపొందిస్తున్నామని, గర్భిణీతో పాటు ఒక సహాయకురాలికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవతో డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద రూ.2.10 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. అలాగే ఎన్టీపీసీ సహకారంతో నర్సీపట్నంలోని 9 పీహెచ్‌సీల అభివృద్ధికి రూ.72.5 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో కేవలం 7 టిఫా స్కానింగ్ మిషన్లను ప్రభుత్వం మంజూరు చేయగా, అందులో ఒకటి నర్సీపట్నం ఆసుపత్రికి రావడం గర్వకారణమన్నారు. ఈ మిషన్ ద్వారా గర్భస్థ శిశువు లోపాలను ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ కె.వి.ఎల్.పి రాజు, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జడ్పిటిసి రమణమ్మ, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ సూర్య చంద్ర, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ సుధా, ఆసుపత్రి సిబ్బంది, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరు అంగన్వాడీలో ఈసీసీఈ డే



**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట, మండలం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రోలుగుంట మండలం ఐసిడిఎస్ రావికమతం ప్రాజెక్టు బుచ్చంపేట సెక్టార్లోని కొవ్వూరు గ్రామ అంగన్వాడీ సెంటర్-2లో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే (ఈసీసీఈ డే) ఘనంగా జరిగింది. ప్రీస్కూల్ పిల్లలకు, తల్లులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలు, ఆటలు, ప్రీస్కూల్ పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య 1, 2కి సంసంబంధించిన పుస్తకాలు, ఆటలు వస్తువులు అందజేశారు. ప్రతిరోజూ ఆటపాటల మధ్య విద్యను అందించే విధంగా క్రియల ద్వారా అభ్యాసాలు చేపట్టాలని తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమం పిల్లల సృజనాత్మకత, మానసిక, శారీరిక అభివృద్ధిని పెంచుతుందని కొవ్వూరు మహిళా పోలీసు వరలక్ష్మి తెలిపారు. తల్లులకు, పిల్లలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఐసిడిఎస్ కార్యక్రమాలు గ్రామీణ పిల్లల విద్యా అభివృద్ధికి దోహదపడుతున్నాయని స్థానికులు స్వాగతించారు. అనకాపల్లి జిల్లాలో ఐసిడిఎస్ కింద ఈసీసీఈ కార్యక్రమాలు రోలుగుంట మండలం అన్ని గ్రామాలలో సూపర్వైజర్లు ఎస్కే బేగం, హేమ ఆధ్వర్యంలో విస్తృతంగా చేయబడుతున్నాయి. ఇలాంటి స్థానిక కార్యక్రమాలు ప్రీస్కూల్ విద్యను బలోపేతం చేస్తున్నాయి. మరిన్ని గ్రామాల్లో ఇలాంటి కార్యక్రమాలు జరపాలని నిర్వాహకులు కోరారు.

## టీడీపీని బలోపేతం చేద్దాం: తేజోవతి



**పాడేరు, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీని మరింతగా బలోపేతం చేద్దామని ఆ పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు మోజోతి తేజోవతి అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తులో అరకులోయ ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకునేలా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అలాగే కూటమి పాలనలో గిరిజనులకు అన్ని విధాలా మేలు జరుగుతుందన్నారు. గతంలో నిర్లక్ష్యానికి, వివక్షకు గురైన గిరిజన ప్రాంతాలు కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయన్నారు. గిరిజనులకు జరుగుతున్న మేలుపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు పార్టీ క్యాడర్ వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటాలని ఆ పార్టీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షురాలు మోజోతి తేజోవతి పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను పునాదులుగా చేసుకుని స్థానిక సంస్థల్లో ఆశించిన స్థాయిలో విజయాలు సాధించాలన్నారు. ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు బాటలు వేయాలని ఆమె సూచించారు. అలాగే నియోజకవర్గంలో పార్టీని నడిపించడంలో, నేతలు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో పార్టీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ముందున్నారని అభినందించారు. అంతకు ముందు ఆమె మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి స్థానిక మోదకొండమ్మను దర్శించు కున్నారు. తొలిసారిగా ఇక్కడికి వచ్చిన తోజోవతికి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ఏఎంసీ పర్సన్ ఇన్ చార్జి డప్పోడి వెంకటరమణ, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయ రాణి, టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు చల్లంగి జ్ఞానేశ్వరి, సీనియర్ నేతలు చల్లంగి లక్ష్మణరావు, దన్నేటి పలాసి సురేశ్‌కుమార్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోర్నీ రవియాదవ్‌ను పరామర్శించిన అదీప్‌రాజ్



**పరవాడ, పతాకం న్యూస్:** శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పరవాడ మండలం రావాడ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కోర్నీ రవి యాదవ్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక ఆర్ కె హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కోర్నీ రవి యాదవ్ ను పెందుర్తి మాజీ శాసనసభ్యులు, నియోజక వర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్, వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలికులు పైల శ్రీనివాసరావు కలిసి పరామర్శించారు. వీరితో పాటు పరవాడ జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, ఇతర వై.సి.పి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా 'వీర్ బాల్ దివస్' కార్యక్రమం

**కొయ్యూరు, పతాకం న్యూస్:** కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ (సిసిఇ)వారి ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం, మర్రి పాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో "వీర్ బాల్ దివస్" కార్యక్రమాన్ని కళాశాల స్థాయిలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుధ పర్యవేక్షణలో,ఫిజికల్ డైరెక్టర్ ఎల్.రమణమ్మ మరియు చరిత్ర విభాగ లెక్చరర్ జె.భువనేశ్వరిల సమన్వయంతో సమర్థవంతంగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు వీర్ బాల్ దివస్ ప్రాముఖ్యత,బాల వీరుల త్యాగాలు, ధైర్యసాహసాలు మరియు దేశభక్తి విలువలపై సవివరంగా అవగాహన కల్పించారు.బాల వీరులు దేశ స్వాతంత్ర్యం మరియు జాతీయ గౌరవం కోసం చేసిన పోరాటాలు విద్యార్థినులను ఆకట్టుకున్నాయి.విద్యార్థినులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని దేశ చరిత్ర పట్ల అవగాహన పెంపొందించుకోవడంతో పాటు జాతీయ విలువలను తమ జీవితాల్లో అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తించారు.

## 22ఏ భూ సమస్యలకు స్వస్తి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ప్రభుత్వ రికార్డుల్లో నిషిద్ధ జాబితా 22-ఏలో చిక్కుకున్న భూ సమస్యలకు, భూ కబ్జాలకు ఇకపై విముక్తి లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వైసీపీ పాలనలో చేపట్టిన భూముల రీసర్వేతో రైతులకు, ప్రజలకు సమస్యలు ఎదురయ్యాయి. వాటిని పరిష్కరించేందుకుగాను జడ్పీ సమావేశ మందిరంలో 'మీ చేతికి మీ భూమి- 22ఏ భూ స్వేచ్ఛ' పేరిట ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల్లో 90 శాతం రెవెన్యూ సమస్యలే. సమస్యల తక్షణ పరిష్కారానికి కలెక్టర్ నుంచి వీఆర్వో స్థాయి వరకు అధికారులందరినీ ఒకేచోట చేర్చి ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశాం. అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించి, బాధితులకు సంబంధిత పత్రాలను కూడా అందజేస్తాం. ముఖ్యమంత్రి భూ సమస్యలను వేగంగా, శాశ్వతంగా పరిష్కరించేందుకు తహసీల్దార్లకు, ఆర్డీవోలకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ జీవో జారీ చేశారు. న్యాయపరమైన సమస్యలు ఉన్నవి మినహా మిగిలినవి పరిష్కరించి రికార్డులను అప్‌డేట్ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలకు గ్రామాలే 22-ఏ పరిధిలోకి వెళ్లాయి. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తాం. ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. ముఖ్యమంత్రి చొరవతో భూ కష్టాలకు ఇక సెలవ్' అని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ప్రతీ ఫిర్యాదును 'ఈ-ఆఫీస్' ద్వారా నమోదు చేసి, ఇక్కడే ఉన్న అధికారులు తక్షణమే పరిష్కరిస్తారని తెలిపారు. గ్రీవెన్స్‌లో పరిష్కరించిన సుమారు 200 మందికి భూ విముక్తి ధ్రువీకరణ పత్రాలను మంత్రి అచ్చెన్న అందజేశారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామానికి చెందిన మల్లా భారతమ్మ తొలి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఆమె మాట్లాడుతూ 'ఏళ్లుగా మా భూమి 22-ఏలో చిక్కుకుపోయింది. నాతోపాటు మరో 19మంది ఇదే సమస్యతో సతమతమవుతున్నాం. ఈ గ్రీవెన్స్‌లో తక్షణ పరిష్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి మా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని తెలిపారు. అలాగే సోంపేట మండలానికి చెందిన సనపల వాసుదేవరావు, మందసకు చెందిన జుత్తు తారకేశ్వరరావు, ఎచ్చెర్ల మండలానికి చెందిన కొణతల అప్పారావు తదితరులు ధ్రువపత్రాలను అందుకుని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో లక్ష్మణమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, లావణ్య, ఆర్డీవోలు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, తహసీల్దార్లు, సర్వేయర్లు, దేవదాయశాఖ, రిజిస్ట్రేషన్, అటవీ శాఖ అధికారులు, వీఆర్వోలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## దమ్ముంటే చంపాలి... ధర్మాన కృష్ణదాస్‌కు దువ్వాడ శ్రీనివాస్ సవాల్



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఆ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన దువ్వాడ శ్రీనివాస్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. మాటల యుద్ధం కాస్తా హత్యలకు కుట్రలు చేస్తున్నారంటూ ఆరోపణలు, ప్రతి సవాళ్ల వరకు వెళ్లింది. ఏకంగా అర్ధరాత్రి హైవేపైకి వచ్చి దువ్వాడ శ్రీనివాస్ చేసిన హడావుడి జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివరాల్లోకి వెళితే, తనను హత్య చేసేందుకు ధర్మాన కృష్ణదాస్ వర్గం కుట్ర పన్నుతోందని దువ్వాడ శ్రీనివాస్‌కు సమాచారం అందింది. కృష్ణదాస్‌కు సన్నిహితుడైన అప్పన్న అనే వ్యక్తి, దివ్వెల మాధురికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పినట్టు తెలిసింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన దువ్వాడ, హైదరాబాద్ నుంచి నేరుగా శ్రీకాకుళం వచ్చి శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. తన హత్యకు స్కెచ్ వేసింది నిజమే అయితే, దమ్ముంటే ఇక్కడికే వచ్చి తనను చంపాలంటూ సవాల్ విసిరారు. ఈ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ధర్మాన సోదరులు తనపై కక్షగట్టి పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని దువ్వాడ ఆరోపించారు. తనను పూర్తిగా పార్టీ నుంచి బహిష్కరిస్తే, జిల్లాలో ఒక వర్గాన్ని అణచివేస్తున్న వారిపై మరింత స్వేచ్ఛగా పోరాడతానని అన్నారు. ఈ ఆరోపణలపై ధర్మాన కృష్ణదాస్ స్పందించారు. దువ్వాడ శ్రీనివాస్‌పై తనకెందుకు కక్ష ఉంటుందని ప్రశ్నించారు. అనవసర ఆరోపణలు చేస్తూ ఆయనే నవ్వులపాలవుతున్నారని విమర్శించారు. కింజరాపు అప్పన్నతో తాను మాట్లాడింది నిజమే అయినా, దువ్వాడపై తనకు ఎలాంటి కోపం లేదని కృష్ణదాస్ స్పష్టం చేశారు.

## మారేడుమిల్లికి వెళ్లే పర్యాటకులకు పోలీసుల హెచ్చరిక

**మారేడుమిల్లి, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ప్రాంతంలోని అటవీ ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలో, అక్కడకు వెళ్లే పర్యాటకులకు పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. గత నెలలో మారేడుమిల్లి ప్రాంతంలో ఎన్ కౌంటర్లు జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం జరిగిన కూంబింగ్ లో మారేడుమిల్లిలోని లోతట్టు ప్రాంతాల్లో కొన్ని ప్రెజర్ మైన్లు, ల్యాండ్ మైన్లు అమర్చినట్టు గుర్తించారు. భద్రతాదళాలను హతమార్చేందుకు మావోలు వీటిని అమర్చారు. ప్రస్తుతం కూంబింగ్ నిర్వహిస్తున్న బలగాలు... వీటిని వెలికితీసే పనిలో ఉన్నాయి. ఇప్పటికే కొన్ని మైన్లను వెలికి తీశాయి. మరోవైపు, మారేడుమిల్లి లోతట్టు ప్రాంతాలను జల్లెడపట్టి మిగిలిన మందు పాతరలను కూడా వెలికి తీసే చర్యలను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మందు పాతరలను వెలికి తీసేంతవరకు పర్యాటకులు, ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరించారు.

## వైసీపీ బలోపేతమే ధ్యేయం: ఎమ్మెల్యే మత్స్యలింగం




**హుకుంపేట, పతాకం న్యూస్:** అరకు నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న హుకుంపేట మండల కేంద్రంలో శనివారం వైసీపీ శ్రేణులతో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అత్యవసర సమావేశం నిర్వహించారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాటం, క్షేత్రస్థాయిలో సంస్థాగత బలోపేతం అంశాలే ఈ సమావేశానికి కేంద్ర బిందువుగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ప్రజల నమ్మకమే పార్టీకి అసలైన బలం అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరత, ఉపాధి, తాగునీరు, వైద్యం, విద్య వంటి సమస్యలను గుర్తించి వాటిపై సమిష్టిగా ఉద్యమాత్మకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మధ్యనే ఉండి, వారి సమస్యలకు గొంతుకగా నిలవడమే వైసీపీ రాజకీయ దిశ అని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా కార్యకర్తలు పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, క్రమశిక్షణ, ఐక్యత ఉంటేనే రానున్న రాజకీయ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి అనిల్ మాట్లాడుతూ, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు, గ్రామ స్థాయి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ బలోపేతంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశం ముగింపు నాటికి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా ముందుకు సాగేందుకు ఈ భేటీ దోహదపడిందని నాయకులు అభిప్రాయపడ్డారు.

## మన్యం జిల్లాలో అమానవీయ ఘటన.. చెత్త బండిపై వృద్ధురాలి మృతదేహం తరలింపు




**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** ఏపీలోని మన్యం జిల్లాలో అత్యంత దారుణమైన, అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఓ నిరుపేద వృద్ధురాలి మృతదేహాన్ని తరలించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో బంధువులు చెత్త తరలించే రిక్షాపై శ్మశానానికి తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ హృదయవిదారక సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రాధమ్మ (65) భర్త, కుమార్తె చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నారు. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురవడంతో బంధువులు భద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆమె మృతిచెందారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లేందుకు ఆసుపత్రిలో అంబులెన్స్ కోసం ప్రయత్నించగా, అది అందుబాటులో లేదని సిబ్బంది తెలిపారు. ప్రైవేటు వాహనాన్ని సంప్రదిస్తే వారు రూ. 2,500 డిమాండ్ చేశారు. అంత మొత్తం చెల్లించే స్తోమత లేకపోవడంతో నిస్సహాయ స్థితిలో వారు చెత్త సేకరించే రిక్షాలోనే మృతదేహాన్ని ఇంటికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే పంచకర్ల



**పరవాడ, పతాకం న్యూస్ :** పరవాడ మండలం, పెదముషిడివాడ గ్రామానికి చెందిన బలిరెడ్డి ఉమాకి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ. 23932/- చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శనివారం అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకుని ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వర్తించని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని అన్నారు. ఈ మేరకు శనివారం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు ఇందులో భాగంగా పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామానికి చెందిన బలిరెడ్డి ఉమా కి సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 23932/- చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అందించారు ఈ సందర్భంగా సీఎం సహాయనిధి చెక్క మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పంచకర్లకు జనసేన నాయకులు కరణం నర్సింగరావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాలిబోయిన దేముడు, ఉరివిటి వెంకట రమణ, బలిరెడ్డి సతీష్, బలిరెడ్డి శ్రీనివాస్, దుప్పాడ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## మంప పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా సీదరి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ



**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సీదరి శ్రీనివాస్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. జాయిన్ అయిన అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ సీఐ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంప పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఎస్ఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పేదలకు వరం సీఎం సహాయ నిధి




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరు పేదలకు వరమని, దరఖాస్తు పెట్టుకోగానే భరోసా లభిస్తోందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నగరం లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. హిరమండలానికి చెందిన సిగడాన ఆనందరావు అనారోగ్యం పాలై కొద్దిరోజుల కిందట మృతిచెందగా ఆ బాధకి తోడు ఆసుపత్రి ఖర్చులు ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. దీంతో మృతుడి భార్య కేంద్ర మంత్రినికి కలిసి గోడును వెలిబుచ్చారు. ఆయన స్పందించి సీఎంఆర్‌ఎఫ్‌కు సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.2,26,028 మంజూరు కాగా ఆ చెక్కును బాధితురాలు అనసూయకు అందించారు. పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

## తీరు మార్చుకోకుంటే వేటు తప్పదు



**కొత్తూరు, పతాకం న్యూస్:** మిల్లు యజ మానులు ధాన్యం తూకంలో దోపిడీని ఆపకపోతే వేటు తప్పదని జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం టి.వేణు గోపాల్ హెచ్చరించారు. కొత్తూరు మండలంలో నివగాం, వెంకటాపురం, బమ్మిడి మిల్లులను, వసప ఆర్‌ఎస్‌కే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మిల్లు యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ శివదుర్గా రైసు మిల్లులో రికార్డులు, బిల్లుల కంటే అధికంగా ధాన్యం నిల్వలు ఉన్నాయని... వెంకటాపురంలో తక్కువ నిల్వలు ఉన్నాయని గుర్తించినట్టు చెప్పారు. శివదుర్గా రైసుమిల్లు యజమానికి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. రైతుల నుంచి తూకంలో 5 నుంచి 8 కేజీలు మిల్లు యజమానులు దోపిడీ చేస్తున్నట్టు రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. తీరు మార్చుకోకుంటే వేటు తప్పదన్నారు. ఆర్‌ఎస్‌కేలలో ధాన్యం కొనుగోలుపై రైతుల్లో కనీస అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రయత్నించటం లేదన్నారు. దీనితో రైతులు దళారులకు అమ్ముతున్నట్టు గుర్తించామని తెలిపారు

## ఏపీఎన్జీవో అరకు యూనిట్ అధ్యక్షుడిగా భద్రయ్య ఏకగ్రీవం



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని గిరిజన ఉద్యోగుల భవనంలో ఆంధ్రప్ర దేశ్ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీఎన్జీవో) సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా, సమా వేశంలో అరకు యూనిట్ అధ్య క్షుడిగా ఎం. భద్రయ్య ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా గోవిందరావు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు ఎం. భద్రయ్య మాట్లాడుతూ, తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమమే తన ప్రధాన ప్రాధాన్యత అని భద్రయ్య స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వంతో సామరస్యపూర్వక సంబంధాలు నెలకొల్పుతామని, అపరిష్కృత సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఏపీఎన్జీవో సంఘం ప్రతిష్టను మరింత పెంచుతామని, ఈ పదవి బరువు కాదు బాధ్యత అని భద్రయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ కిషోర్, ఎలక్షన్ ఆఫీసర్ ఎస్. సంజీవరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏడీబీ రోడ్డులో వెళ్లేదెలా!



**రాజానగరం, పతాకం న్యూస్:** ఏడీబీ రోడ్డు.. నిత్యం రద్దీగా ఉండే రహదారి ఇది..గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు కష్టాలు చవిచూశారు.. అయితే కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే ఏడీబీ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపిం ది.. సుమారు 35 కిలోమీటర్ల ఉండే రోడ్డులో దాదాపు 32 కిలోమీటర్ల వరకూ రోడ్డును పూర్తి చేశారు..వాహనాలు రయ్ రమ్మంటూ దూసు కెళ్తాయి..అయితే రంగంపేట ఊరి వద్దకు వచ్చేసరికి ఏ వాహనానికైనా బ్రేక్‌లు పడా ల్సిందే..మరో రెండు కిలో మీటర్లు వేగంగా ప్రయాణించి న తర్వాత రాజానగరం చేరుకునేసరికి మరోసారి బ్రేక్‌లు పడాల్సిందే.. కేవలం మూడు కిలోమీటర్ల మేర రహదారి మాత్రమే అసంపూర్తిగా నిలిచి పోయింది. దీంతో వాహనదారులు..అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ప్రయాణికులు పాలిట శాపంగా పరిణమించాయి. ప్రధానంగా రాజానగరం హైస్కూల్ సమీపంలో రహదారి పూర్తిగా ఛిద్రమైంది.. చినుకు పడితే చెరువులా మారిపోతోంది. లేదంటే దుమ్ముతో రోడ్డు కనిపించకుండా పోతోంది. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఎగసిపడుతోంది. ఈ ప్రాంతంలోని దుకాణదారులు, నివాసిత ప్రజల ఇళ్లలోకి దుమ్ము చేరడంతో రాత్రి పగలు తేడా లేకుండా తలుపులు మూసుకుని కాలం వెళ్లదీస్తున్నా మంటూ స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. రాజానగరం హైస్కూల్ కూడలి లో ఫ్లయ్ ఓవర్ నిర్మించాలి ఉంది. పరిహారం వ్యత్యాసం విషయమై ఈ ప్రాంతంలోని కొంత మంది కోర్డును ఆశ్రయించడంతో ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో రహదారి అభివృద్ధి పనుల్లో జాప్యం తలెత్తింది. కేవలం కిలోమీటరు పరిధి కూడా ఉండని ప్రాంతంలోని ప్రజలు నిత్యం దుమ్ము, ధూళితో సహవాసం చేయడం పరిపాటిగా మారింది. దీనిపై సంబంధిత అ?ధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోతోందని ప్రజలు వాపోతున్నారు.చేసేదిలేక నివాసితులు మోటార్లు వినియోగించి నీటి తో ప్రతిరోజు దుమ్మలేచిపోకుండా తడుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికా రులు దృష్టిసారించి ఏడీబీ రోడ్డు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

## పెరిగిన బంగారం, వెండి ధరలు: పసిడి రూ.1.43 లక్షలు... నెల రోజుల్లో రూ.80 వేలు పెరిగిన వెండి



**ముంబై, పతాకం న్యూస్:** బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,000 పలికి గరిష్ఠ స్థాయికి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,31,000గా ఉంది. వెండి కిలో ధర రూ.2,50,000కు చేరుకుంది. నెల రోజుల్లోనే వెండి ధర రూ.80,000కు పైగా పెరగడం గమనార్హం. ప్రస్తుత క్యాలెండర్ ఏడాది (2025)లో పసిడి ధర 70 శాతం పెరిగింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో బంగారం ఇంత భారీగా పెరగడం సుమారు 45 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అని బులియన్ మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో 2026 ప్రారంభంలోనూ పసిడి ధరలు మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా ఉండటంతో, ఫెడరల్ రిజర్వ్ తదుపరి సమీక్షలో వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతుండటంతో, సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు.

## పాఠశాల స్థాయి నుంచే, విద్యార్థులకు దేశభక్తిని బోధించాలి: సంధ్యాదేవి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వీరబాల్ దివస్ వేడుకలు శనివారం జిల్లా పరిషత్ జంక్షన్ మహారాణిపేట ఆల్వేట్ హైస్కూల్ ఆవరణలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ముందుగా బాబా జోరావర్ సింగ్ , బాబా ఫతేసింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి వారు ప్రసంగిస్తూ గుర్తింపు నోచుకోని అమరవీరులను నేటి యువతరానికి వారి చరిత్రను తెలుపుట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. విద్యార్థులు దేశము పట్ల, ధర్మము పట్ల అంకిత భావముతో ఉండాలని కోరారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు నాటి త్యాగమూర్తుల బలిదానాన్ని నేటి యువత గుర్తుంచుకోవాలని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు, హింసకు అలవాటు కావద్దని, నిత్యము యోగ, ఆటపాటల సాధన తో విజయం సాధించవచ్చని అన్నారు. ఆల్వేట్ స్కూల్ కరస్పాండెంట్ షీలా జాక్సన్ ప్రసంగిస్తూ విద్యార్థుల బాధ్యత సమాజంలోని అందరిదీ అని అన్నారు ఈ కార్యక్రమం మా స్కూల్ ఆవరణలో జరగటం ఆనందదాయకమని అన్నారు . కార్యక్రమ కన్వీనర్ రూపాకుల రవికుమార్, కో కన్వీనర్ ఎస్ దానేష్, పల్లాచలపతిరావు, దేవర చంద్రశేఖర్, తలాడ గిరిజ, కె ప్రసాదు, ఎల్ శ్రీరామ్, సుశీల, రమ, మంజుల, లక్ష్మి ఆల్వేట్ స్కూల్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు

# అడుగులు వేగంగా పడాలి.. లేదంటే 'గ్రేటర్ విజయవాడ' మరింత ఆలస్యం



**విజయవాడ, పతాకం న్యూస్:** విజయవాడ మహా నగరానికి అడుగులు మరింత త్వరితగతిన పడాల్సిన సమయమిది. ఒకవైపు ప్రపంచస్థాయి నగరంగా అమరావతి రూపకల్పన జరుగుతున్న తరుణంలో విజయవాడను ఇలాగే వదిలేస్తే ఎలాంటి సౌకర్యాలు, మౌలిక వసతులు లేని ఓ చిన్న పాత నగరంలా మిగిలిపోతుంది. ఇప్పటికే విజయవాడకు చుట్టుపక్కల ఉన్న మైలవరం, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని పదుల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. వాటితో పాటు తాడిగడప లాంటి మున్సిపా లిటీలు కూడా అనధికారికంగా విలీనమైనా నగరపాలికలో భాగం కాకపోవడంతో నేటికి అభివృద్ధికి దూరంగానే ఉండిపోతున్నాయి. విజయవాడ మహానగరమైతే విస్తీర్ణం భారీగా పెరుగుతుంది. జనాభా అనధికారికంగా 20 లక్షల పైనే ఉంటుంది. దీంతో వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద పెద్దఎత్తున నిధులు కూడా వస్తాయి. సీనియర్ ఐఏఎస్ అధికారులు కమిషనర్లుగా ఉంటారు. వేగంగా అభివృద్ధి చెందే వీలుంటుంది. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు మహానగరం ఆవిర్భవిస్తుంది. నగరానికి ఆనుకుని ఉండే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ప్రాంతాలే కాకుండా గుంటూరు పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీలు కూడా దాదాపు విజయవాడతో కలిసిపోయాయి. వీటిని కూడా విలీనం చేస్తే గనక రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా విజయవాడ ఏర్పడుతుంది. భవిష్యత్తులో చుట్టుపక్కల ఉండే గుంటూరు, తెనాలి, గన్నవరం, పరిటాల, కంకిపాడు వరకూ నగరం విస్తరిస్తుంది. ప్రస్తుతం గ్రేటర్ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు పచ్చజెండా ఊపడంతో అధికారులు మరింత వేగంగా చర్యలు చేపడితే దశాబ్దాల కల సాకారమవుతుంది. నగర జనాభా 20 లక్షల పైనే: 2011 లెక్కల ప్రకారం విజయవాడ మున్సిపల్? కార్పొరేషన్? పరిధిలో 10.34 లక్షల జనాభా ఉంది. విలీనం కానున్న 74 గ్రామాల పరిధిలో ఉన్న 5.54 లక్షల జనాభాను కూడా కలిపితే మొత్తం 15.88 లక్షలు అవుతుంది.. రాష్ట్ర విభజన తర్వాత గత 10 ఏళ్లలో నగర జనాభా 20 శాతానికి పైగా పెరిగింది. విలీన గ్రామాల్లోని పెరుగుదలతో కలిపితే గనక కనీసం జనాభా నాలుగైదు లక్షలు అదనంగా ఉంటుంది. ఈ లెక్కన గ్రేటర్ జనాభా ప్రస్తుతం అనధికారిక లెక్కల ప్రకారం 20 లక్షలకు పైనే ఉంటుంది. విజయవాడ శివార్లలోని 7 మండలాల్లోని గ్రామాలు విలీనం కానున్నాయి. ఇబ్రహీంపట్నం-13, విజయవాడ రూరల్-19, కంకిపాడు-11, జి.కొండూరు-02, పెనమలూరు- 08, గన్నవరం-19, ఉంగుటూరు పరిధిలో రెండు గ్రామాలు ఉన్నాయి. అలాగే తాడిగడప, కొండపల్లి రెండూ మున్సిపాలిటీలు కూడా విలీనం కానున్నాయి. ఈ గ్రామాలు ఎప్పుడో భాగమైపోయాయి: విజయవాడలో ఇప్పటికే జక్కంపూడి, గొల్లపూడి, కానూరు, పోరంకి, తాడిగడప, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి ఇవన్నీ పూర్తిగా కలిసిపోయాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఉండడంతో అభివృద్ధి నోచుకోకుండా ఉన్నాయి. నేటికి ఇక్కడ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు సరిగా లేవు. జక్కంపూడి, వైఎస్ఆర్ కాలనీలు నగరంలో అనధికారికంగా భాగమైపోయాయి. అత్యధిక మందికి గుర్తింపు కార్డులు కూడా విజయవాడలోనే ఉన్నాయి. 30 వేలకు పైగా ఇక్కడ ఓట్లు ఉంటే కేవలం మైలవరంలో 13 వేలు మాత్రమే ఉన్నాయి. శివార్లలోని అన్ని గ్రామాల పరిస్థితీ ఇదే. 2014 తర్వాత తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లోనూ జనాభా 20 శాతానికి పైగానే పెరిగిందని అంచనా. తాడేపల్లి, మంగళగిరి పేరుకు గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. ఇవి ఎక్కువగా ఆధారపడేది మాత్రం విజయవాడపైనే. తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీలను కూడా గ్రేటర్ విజయవాడలో విలీనం చేస్తే గనక నగర పరిధిలో జనాభా భారీగా పెరుగుతుంది. గ్రేటర్ విజయవాడ ఏర్పడితే దాని విస్తీర్ణం 661.79 చదరపు కిలోమీటర్లు అవుతుంది. తాడేపల్లి, మంగళగిరి కూడా కలిస్తే మహానగరపాలక సంస్థగా మారుతుంది. చిన్న పంచాయతీలు, మున్సిపాలిటీలుగా ఉంటేనే తమ చెప్పుచేతల్లో ఉంటాయని, నచ్చినట్టు పనులు చేయించుకోవచ్చని కొందరు ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు.

అందుకే వీరు గ్రేటర్ విజయవాడలో విలీనం వద్దంటూ మోకాలడ్డుతున్నారు. గ్రేటర్‌గా మారితే అక్కడ ఉన్నతాధికారులు ఉంటారని, తమ మాట వినే పరిస్థితి ఉండదనేది భయం కూడా కొందరిలో ఉంది. గ్రేటర్ ఏర్పాటుకు డిసెంబర్ 31లోగా నోటిఫికేషన్ కచ్చితంగా ఇస్తేనే ప్రక్రియ పట్టాలెక్కుతుంది. లేదంటే జనవరి నుంచి జనగణన ప్రారంభమవుతుంది. అధికారులంతా నెలల తరబడి ఆ పనుల్లో తలమునకలై ఉంటారు. ఆ తర్వాత పంచాయతీల ఎన్నికల కోడ్ వస్తుంది. ఎన్నికలు జరిగితే ఈ పంచాయతీలకు కొత్త సర్పంచులు వస్తారు. ఎన్నికైన వెంటనే విలీనమంటే అంగీకరించరు. దీంతో గ్రేటర్ ప్రతిపాదన మళ్లీ మొదటికొస్తుంది. విలీన ప్రాంతాల్లో గ్రామసభలు పెట్టి తీర్మానాలు చేసిన తర్వాత నోటిఫికేషన్ ఇవ్వాలంటే ఈ నెలాఖరులోగా పూర్తవడం కష్టం. అందుకే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించి గెజిట్‌ను విడుదల చేస్తే వెంటనే ప్రక్రియను ప్రారంభించవచ్చని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నారు. తాజాగా హైదరాబాద్ మహానగరపాలక సంస్థ పరిధిని పెంచి 300 డివిజన్లుగా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇలాగే గెజిట్‌ను విడుదల చేసింది. ఇదే విధానం ఇక్కడా అమలు చేస్తే బాగుంటుందని చెబుతున్నారు.

# పోలీసు నీడలో ప్రతిప్తాడు శివాలయం



**భీమవరం, పతాకం న్యూస్:** పెంటపాడు మండలం ప్రత్తిపాడు శివాల యం రెవెన్యూ శాఖ స్వాధీనంలోకి వెళ్లింది. గ్రామంలో వివాదం జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. ఆలయ నిర్మాణంపై గ్రా మానికి చెందిన ఇద్దరు భూ యజమానులు వేసిన పిటిషన్‌పై ప్రభుత్వ భూములు పరి రక్షించాలంటూ హైకోర్టు ఆదేశించింది. అయి నప్పటికి నిర్మాణం నిలుపుదల చేయలేదం టూ కోర్టు ధిక్కరణ కేసు వేశారు. ఈ నేప థ్యంలో ఆలయంలో విగ్రహాలు పెట్టేయడంతో జిల్లా కలెక్టర్ నాగరాణి రెవెన్యూ, పంచాయతీ రాజ్‌కు చెందిన నలుగురు అధికారులను సస్పెండ్ చేసి వారి స్థానంలో ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. పెంటపాడు ఇన్‌ఛార్జ్ తహ శీల్దార్‌గా గణపవరం తహశీల్దార్ అప్పారావు కు బాధ్యతలు అప్పగించారు. మండల ఇన్ చార్జి ఈవోపీఆర్‌డీగా పెంటపాడు కార్యదర్శి బాలకృష్ణ, ప్రత్తిపాడు ఇన్‌చార్జి కార్యదర్శిగా అలంపురం గ్రామ కార్యదర్శి కొండలరావు, ఇన్‌చార్జి వీఆర్‌వోగా జట్లపాలెం వీఆర్‌వో రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. గ్రామంలో విరాళాలు సేకరించిన ఆలయా న్ని నిర్మిస్తున్నారు. ఆలయానికి ఆనుకుని ఓ నివాస స్థలం ఉంది. దానిపై నీడ పడుతుం దంటూ స్థల యజమాని నిర్మాణదారులతో సంప్రదింపులు జరిపారు. సదరు స్థలాన్ని కొనుగోలు చేయడానికి నిర్మాణదారులు సిద్ధ మయ్యారు. ధర నిర్ణయంలో తేడాలు రావ డంతో అవి ఆగిపోయాయి. మరోవైపు ఆల యానికి ఆనుకుని వ్యవసాయ భూమి ఉంది. ఆలయ నిర్మాణం వల్ల తమ పొలానికి నీరు ఆగిపోయిందంటూ ఓ రైతు కోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో పంచాయతీ గ్రామంలోని నిర్మాణ దారులకు నోటీసులు ఇచ్చింది. పోలీ సులకు ఫిర్యాదు చేస్తే కేసు నమో దు చేశారు. ఇంకోవైపు నిర్మాణం జరుగుతుందంటూ హైకోర్టులో నమోదైన కేసు జనవరి 5న విచారణకు రానుంది. ఈ క్రమంలో నిర్మాణం నిలిచి పోవాలి. నిర్మాణదారులు కంగారుపడ్డారు. శాస్త్రోక్తంగా ప్రతిష్టించాల్సిన దేవతామూర్తులను గుట్టు చప్పుడు కాకుండా ఆలయంలో పెట్టేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. నలుగురు అధికారుల ను సస్పెండ్ చేశారు. ఆలయాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు భారతీయ న్యాయ శిక్షాస్మృతి (బీఎన్ఎస్ఎస్) 164 సెక్షన్ విధించారు. పగలు, రాత్రి పోలీ సులు గస్తీ ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఆలయం నిర్మిస్తున్న స్థలం ఎవరిదనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. పంచాయతీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి విచారణ కోసం స్థలం ఎవరిదనేది నిర్ధారించేందుకు జిల్లా పరిషత్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధి కారులకు పోలీసులు లేఖలు రాశారు. అది తమది కాదంటూ మూడు శాఖల నుంచి సమాధానం అందినట్టు సమాచారం. నీటిపా రుదల శాఖ నుంచి వివరాలు రావాలి. ఇలా స్థలంపై సందిగ్ధత నెలకొంది. ప్రత్తిపాడుకు శివాలయం ఉండాలన్న ఉద్దేశంతో కొందరు గ్రామస్థులు ప్రజల నుంచి విరాళాలు సేక రించి ఆలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఖాళీ స్థలంలో నిర్మాణం చేపట్టారు. హైకోర్టు లో కేసుల నమోదుతో వివాదాస్పదమైంది. కేసు తేలే వరకు నిర్మాణదారులు ఓపిక పట్టా ల్సింది. ఆలయంలో శివ లింగం, గణపతి, అమ్మవా ర్ల దేవతామూర్తులను ఏర్పాటుచేశారు. ఒకవైపు కోర్టు ధిక్కరణ కేసు ఉండగా దేవతామూర్తులను నెలకొల్పడంతో అధికారులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. కేసులో ప్రతివాదిగా ఉన్న జిల్లా కలెక్టర్ నలుగురు అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ అప్పారావు పెంటపాడు మండల వీఆర్‌వోలతో సమీక్ష నిర్వహిం చారు. రాత్రి పగలు పహారా ఉండాలంటూ వీఆర్‌వోలకు దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ, రూరల్ సీఐ, పెంటపాడు ఎస్ఐలు ఆలయాన్ని పరిశీలించారు. గ్రామం నుంచి ఏ ఒక్కరూ ఆలయాన్ని సందర్శించకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు.

# సిజేరియన్ ప్రసవాలు పెరగడానికి కారణాలివే!

అమ్మ కావడం గొప్ప వరం. తన ప్రాణాలు పణంగా పెట్టి పురిటి నొప్పులు భరిస్తూ, ముద్దులొలికే శిశువును భూమ్మీదకు తెచ్చే కాన్పు, ఏ తల్లికైనా పునర్జన్మతో సమానం. ఒకప్పుడు కాన్పులంటే సాధారణ ప్రసవాలే ఎక్కు వగా ఉండేవి. కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లోనే సిజేరియన్లు జరిగేవి. కానీ, ఇప్పుడు సాధారణ ప్రసవాలతో పోలిస్తే సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో సిజేరియన్ ఆపరేషన్లు పెరగడానికి కారణాలు ఏంటి? దీన్ని వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయి? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం! కడుపుకోసి బిడ్డను బయటికి తీయడం నేడు అతిమామూలు విషయంగా మారిపోయింది. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల కాసుల కక్కుర్తికి తోడు కుటుంబ సభ్యుల మంచి ముహూర్తం, నమ్మకాలు, ఇతర కారణాల వల్ల సిజేరియన్ ఆపరేషన్లు రానురానూ పెరిగిపోతున్నాయి. సాధారణంగా తల్లికి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు, శిశువు ఎక్కువ బరువు పెరిగినప్పుడు, ఇతరత్రా కారణాలతో ఎంతో అవసరమైతేనే సిజేరియన్ చేయాలి. కానీ, జీవనశైలి కారణాలు, సామజిక, మానసిక పరిస్థితులు కూడా సిజేరియన్ ఆపరేషన్లు పెరగడానికి ప్రధాన కారణమవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం.. సిజేరియన్ డెలివరీలు 10 నుంచి 15 శాతానికి మించకూడదు. అయితే, ప్రస్తుతం నార్మల్ డెలివరీ కన్నా సిజేరియన్ ఆపరేషన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. గర్భిణుల్లో శారీరక శ్రమ తగ్గిపోవడం, ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి, బరువు పెరగడం, చిన్న నొప్పులకే భయపడి పోతున్నారు. గర్భాశయ కండరాలు బలహీనంగా ఉండడం వల్ల సాధారణ ప్రసవానికి శరీర సామర్థ్యం తట్టుకోవడం లేదు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ, డెలివరీ టైంలో వచ్చే క్లిష్ట పరిస్థితులతో ప్రమాదం అనిపిస్తే సిజేరియన్?కు మొగ్గు చూపుతున్నారు.

సిజేరియన్ చేయిస్తే నొప్పి లేకుండా తేలిగ్గా కాన్పు అయిపోతుందని చాలామంది భావిం చడం. నార్మల్ డెలివరీ అంటే నొప్పులు భరించ లేమన్న



భయంతో గర్భిణులు సిజేరియన్లు ఎంచుకుంటున్నారు. ఈ దిశగా కుటుంబ సభ్యులూ ప్రోత్సహిస్తున్నారు. అమావాస్య, రాహుకాలంలో బిడ్డ పుట్టకూడదని, ఎంచుకున్న, మంచి ముహూర్తంలో శిశువు జన్మించాలని కుటుంబసభ్యుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. కొందరు వృత్తి, ఉద్యోగ వ్యాపకాల్లో పడి వయసు మీరిన తర్వాత పిల్లలను కనాలన్న ఆలోచనకు రావడంతో ఆరోగ్య సమస్యలు నార్మల్ డెలివరీలకు ప్రతికూలంగా మారుతున్నాయి. అవసరం ఉన్నా, లేకున్నా సీ-సెక్షన్ డెలివరీలు చేయిస్తుండడంతో తల్లుల్లో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. వైద్య ఖర్చులూ పెరుగు తున్నాయి. బిడ్డ శరీరం, తల పెద్దగా ఉన్నప్పుడు, తల్లి కటిభాగం నుంచి సురక్షితంగా వెళ్లలేనప్పుడు. శిశువు కంటే తల్లి కటిభాగం చిన్నగా ఉన్నప్పుడు. నార్మల్ డెలవరీతో గర్భాశయం చిట్లే ముప్పు ఉంటుందని భావించినప్పుడు. ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది పిల్లలు పుట్టే అవకాశం ఉందని తేలినప్పుడు.

మాయపొర గర్భాశయ గోడకు చాలా కిందికి అంటుకొని ఉండి, గర్భాశయ ముఖద్వారం గుండా బిడ్డ బయటకు రాకుండా అడ్డు పడుతున్నప్పుడు బిడ్డ అడ్డం తిరిగినపుడు, శిశువు తలకు బదులు కాళ్లు ముందుకు ఉన్న సమయంలో తప్పనిసరిగా సిజేరియన్ చేయాల్సిందే. గర్భధారణ సమయంలో బీపీ, చేతులు-కాళ్లలో వాపు, తలనొప్పి, కళ్లు బైర్లు కమ్మడం, ఫిట్స్ వంటి ప్రీ ఎక్లాంప్సియా లక్షణాలున్నా, గర్భంలో బిడ్డ హృదయ స్పందన, కదలికలు తగ్గడం వంటి ఫీటల్ డిస్ట్రెస్ పరిస్థితుల్లో హైపర్?టెన్షన్ తరహా నిజమైన వైద్యపరమైన కారణాలు ఉన్నప్పుడు సిజేరి యన్‌తో ప్రాణాలు కాపాడొచ్చు. కానీ, చాలా కేసుల్లో ఇలాంటి అత్యవసర పరిస్థితులు లేకున్నా సీ-సెక్షన్ ఆపరేషన్లు చేస్తున్నారు. సిజేరియన్‌లో కోత కారణంగా కొద్ది రోజులు మంచానికి పరిమిత మవ్వాల్సి ఉంటుంది. ఆ గాయం మానడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ ఆపరేషన్ వల్ల రక్తస్రావం, రక్తం గడ్డకట్టడం, గర్భాశయంలో ఇన్ఫెక్షన్ లాంటి సమస్యలు వస్తాయని అధ్యయనం పేర్కొంది. కొన్ని సందర్భంలో కోత తాలూకా నొప్పి సుదీర్ఘకాలం వేధిస్తుంది. కొంతమందిలో వెన్నునొప్పి లేదా కుట్లు వేసిన ప్రాంతంలో దీర్ఘకాలిక నొప్పి ఉండవచ్చు. అలాగే, పొట్టను కోసేటప్పుడు ఒక్కోసారి సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మూత్రాశయం, పేగులు, నాడులు తెగిపోయే ప్రమాదం పొంచి ఉంటుంది. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా పుట్టిన బిడ్డలకు శ్వాస సమస్యలు, అలర్జీల బెడద ఎక్కువగా ఉండవచ్చు. వీటన్నింటి దృష్ట్యా అత్యవసరం అయితే తప్ప సుఖప్రసవాలే తల్లీబిడ్డలకు ఎంతో శ్రేయస్కరం. నార్మల్ డెలవరీ తల్లిబిడ్డల ఆరోగ్యానికి మంచిది. దీంతో తల్లులు త్వరగా కోలుకుంటారు. తల్లి పాలు, గట్ మైక్రోబియం అనే బ్యాక్టీరియా బిడ్డకు చేరి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీ-సెక్షన్ ప్రసవాల్లో తల్లి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. రక్తస్రావం, ఇన్ఫెక్షన్ లాంటి సమస్యలకూ ఆస్కారం ఉంది. మళ్లీ గర్భం దాల్చాలన్నా సమస్యలు తలెత్తుతాయి. చాలా మందిలో తొలిసారి గర్భం దాల్చడం ఆలస్యమవుతోంది. గర్భిణుల్లో సహజ ప్రసవంలో నొప్పులు ఎక్కువనే భయం పోగొట్టాలి. అయిన వారి సంరక్షణ, నిరంతర వైద్య సేవలు సూచనలు తప్పనిసరిగా పాటించాలి. హాస్పిటల్‌కు వచ్చే గర్భిణుల్లో అవగాహన కల్పించి మానసిక స్థైర్యం నింపితే నార్మల్ డెలివరీ దిశగా ప్రోత్సహించవచ్చు అని ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీ శిరీష తెలిపారు.

గర్భిణులు తొలిసారి తమను సంప్రదించినప్పటి నుంచే నార్మల్ డెలివరీకి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై డాక్టర్లు వారికి అవగాహన కల్పించాలి. వీలైనంత వరకు సుఖప్రసవం అయ్యే వరకూ వేచి చూడాలి. లేకపోతే, స్వచ్ఛంద సిజేరియన్ డెలివరీలకు మరో డాక్టర్ అభిప్రాయం తీసుకోవాలి. అలాగే, గర్భిణులకు సహజ ప్రసవం వల్ల కలిగే ఆరోగ్య, వైద్యపరమైన ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి.

# త్త చెప్పులు కొంటున్నారా? - ఈ జాగ్రత్తలు తీసుకోవాలట!

ఈ రోజుల్లో ఎవరైనా చెప్పులు లేకుండా నడవడం దాదాపుగా అసాధ్యమే! అందులోనూ "స్టైల్ ముఖ్యం బిగిలు" అంటూ ట్రెండీగా ఉండేవి ఎంచుకుంటారు. ఈ క్రమంలో వేసుకునే చెప్పులు కాలికి సరిపోయాయా అని మాత్రమే చూసుకుంటారు. కానీ, పాదరక్షలు ఆరోగ్యాన్ని డిసైడ్ చేస్తాయని తెలుసుకోరు. అనారోగ్యాన్ని మోసుకొస్తాయని పట్టించుకోరు. చెప్పుల విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి, ఏ రకం చెప్పులు వేసుకుంటే ఆరోగ్యానికి మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం! చెప్పుల విషయంలో దాదాపుగా అందరూ స్టైల్ కు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుంటారు. ముఖ్యంగా మహిళలు హై-హీల్స్ యూజ్ చేస్తుంటారు. ఇలాంటి పాదరక్షలు ఒకటి, రెండు సార్లు అయితే పరవాలేదు కానీ, తరచూ వేసుకుంటే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎత్తు మడమల చెప్పుల్ని తరచూ వాడుతుంటే అవి పాదం సహజ ఆకృతిని మార్చే ప్రమాదం ఉందని అధ్యయనం పేర్కొంది. హైహీల్స్ వాడడం వల్ల పాదాల అడుగున వంపు ఎక్కువవుతుందని నిపుణులు చెబుతున్నారు. 'అఖిలిస్ టెండాన్స్' చీలమండలో వెనక భాగం ఒత్తిడికి లోనై కుంచించుకుపోతాయని పేర్కొంటున్నారు. అంతేకాకుండా హైహీల్స్ వేసుకుంటే శరీరం ముందుకు వంగిపోతుందని వివరిస్తున్నారు. పాదం ముందరి భాగం, బొటనవేలి మీద శరీర బరువు పడుతుందని తెలియజేస్తున్నారు. దీంతో వెన్నెముక నొప్పి, కాలి వెనుక భాగాల నొప్పులు వస్తాయంటున్నారు. ఈ క్రమంలో హీల్స్ 2 అంగుళాల కంటే తక్కువ ఎత్తు ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. కేవలం వాటి నంబర్ చూసి తీసుకోకూడదని సలహా ఇస్తున్నారు. హీల్స్ స్ట్రాప్స్, లాకింగ్ మెకానిజం టోస్ గ్రిప్ అంతా చూడాలని చెబుతున్నారు. మొత్తంగా క్వాలిటీ చెప్పులను వినియోగించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే మోకాళ్ల నొప్పులు వంటి సమస్యలు ఉన్నవారు ఆర్థోటిక్స్ పాదరక్షలు ధరించాలని సూచిస్తున్నారు. ఇవి ధరించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. చీలమండ సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి ఈ పాదరక్షలు మేలు చేస్తాయని అధ్యయనం పేర్కొంది. ఆర్థోటిక్స్ అనే పదాన్ని వైద్య పరిభాషలో ఎక్కువగా వినియోగిస్తారు. ఈ పాద రక్షలు షూ ఇన్సోల్స్ పాదాలకు సరిగ్గా సెట్ అవుతాయి. నడవడానికి కూడా చక్కగా ఉంటాయి. ఇవి పాదాల ఆకృతికి అనుగుణంగా సరిగ్గా అమరే ప్రత్యేకమైన ఇన్సోల్స్. ఈ పాద రక్షలు నడకను మెరుగుపరచడంతోపాటు పాదాలకు మంచి సౌకర్యాన్ని, సపోర్టును అందిస్తాయి. సాధారణ ఇన్సోల్స్ మాదిరిగా కాకుండా, వ్యక్తి పాదాల ఆకారం, నడక నమూనా, వైద్య పరిస్థితి ఆధారంగా వాటిని ప్రత్యేకంగా తయారు చేస్తారు.

ఇవి ధరించడం వల్ల పాదాలకు ఎలాంటి ఇబ్బందులూ కలగవు. నొప్పులు, ఇతరత్రా సమస్యలను తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చెప్పుల విషయంలో యూరప్, యూకే దేశాల కొలతలను పాటిస్తున్నాం. తీసుకునే సమయంలో కాలికి అందం కోసం మాత్రమే కాకుండా ముందు భాగానికి మెత్తదనంగా ఉండేలా చూసుకోవాలి. పాదాలలో ఏదైనా ఇబ్బందిగా ఉందనుకుంటే ఇన్సోల్ వాడడం ఉత్తమం-ఎం.నరేంద్రనాథ్, ఎండో వాస్కులర్ సర్జరీ విభాగాధిపతి, కిమ్స్ ఆసుపత్రి, హైదరాబాద్



ఆర్థోటిక్స్ పాదరక్షలు ధరించిన పిల్లలు నడిచేటప్పుడు అటూ ఇటూ ఊగిపోవడం ఉండదు. నేరుగా వెళ్లే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పెద్దల్లో దీర్ఘకాలిక పాదం, మోకాలి, వెన్నునొప్పులు తగ్గించేందుకు వీలుంటుందట. వ్యాయామం చేసే వారిలో ఇవి మరింత ఎక్కువ సేపు నడిచేలా సాయం చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

# మొబైల్ తయారీలో భారత్ దూకుడు...

## ప్రపంచంలోనే రెండో స్థానం!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రకటించారు. గత 11 ఏళ్లలో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, ఎగుమతులు ఏకంగా ఎనిమిది రెట్లు వృద్ధి చెందాయని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుత ప్రగతికి చోదకశక్తిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. భారీస్థాయి ఎలక్ట్రానిక్స్ తయారీ కోసం ప్రవేశపెట్టిన పీఎల్ఐ పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 13,475 కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలో సుమారు రూ. 9.8 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సాధ్యమైందని, ఇది తయారీ, ఉద్యోగ కల్పన, ఎగుమతులను గణనీయంగా పెంచిందని వివరించారు. కేవలం గత ఐదేళ్లలోనే ఈ రంగంలో 1.3 లక్షలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగిందని ఆయన అన్నారు. ఒకప్పుడు ఏడో స్థానంలో ఉన్న ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు, ఇప్పుడు దేశంలో మూడో అతిపెద్ద ఎగుమతి కేటగిరీగా ఎదగడం 'మేక్ ఇన్ ఇండియా' విజయానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వం తొలుత పూర్తయిన ఉత్పత్తులపై దృష్టి సారించినప్పటికీ, క్రమంగా విడిభాగాలు, ముడి పదార్థాలు, వాటిని తయారుచేసే యంత్రాల తయారీ సామర్థ్యాన్ని పెంచడంపై కూడా దృష్టి పెట్టిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇందుకోసం ప్రవేశపెట్టిన 'ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్'కు అద్భుత స్పందన లభించిందని చెప్పారు. ఈ పథకం కింద 249 దరఖాస్తులు రాగా, వాటి ద్వారా రూ. 1.15 లక్షల కోట్ల పెట్టుబడులు, రూ. 10.34 లక్షల కోట్ల ఉత్పత్తి, 1.42 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇదే అత్యధిక పెట్టుబడి నిబద్ధత అని, ఇది పరిశ్రమకు ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తోందని ఆయన అన్నారు. సెమీకండక్టర్ రంగంలోనూ భారత్ వేగంగా పురోగమిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పది యూనిట్లకు ఆమోదం లభించగా, వాటిలో మూడు పైలట్ లేదా ప్రాథమిక ఉత్పత్తి దశలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే భారత్‌లో తయారైన ఫ్యాబ్‌లు, ఏటీఎంపీలు ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ తయారీదారులకు చిప్స్‌ను సరఫరా చేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

గత దశాబ్ద కాలంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం దేశవ్యాప్తంగా 25 లక్షల ఉద్యోగాలను సృష్టించిందని, ఇదే క్షేత్రస్థాయిలో నిజమైన ఆర్థిక వృద్ధి అని మంత్రి అభివర్ణించారు. "పూర్తయిన ఉత్పత్తుల నుంచి విడిభాగాల వరకు ఉత్పత్తి పెరుగుతోంది. ఎగుమతులు దూసుకుపోతున్నాయి. ప్రపంచ కంపెనీలు నమ్మకంతో ఉన్నాయి. భారత కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. ఇదే 'మేక్ ఇన్ ఇండియా' విజయగాథ" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# కాలుష్యాన్ని ఎదుర్కోవడంలో చైనా నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవాలి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** చైనా, భారత్‌లు చాలాకాలంగా తీవ్రమైన వాయు కాలుష్యంతో సతమతమవుతున్నాయి. అయితే చైనా తీసుకున్న పంథా వల్ల అక్కడి కాలుష్యం తగ్గింది. ఒకప్పుడు ప్రపంచ పొగమంచుకు చిహ్నంగా ఉన్న బీజింగ్ 2013-2021 మధ్య వార్షిక పిఎం2.5 (పర్టిక్యులేట్ మ్యాటర్) స్థాయిలను 50 శాతం కంటే ఎక్కువ తగ్గించగలిగింది. చైనా వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో విజయం సాధించింది. మరి భారత్‌లో ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల్లో ఢిల్లీ స్థానం కొనసాగుతోంది. అయితే బీజింగ్ కాలుష్యాన్ని ఎలా తగ్గించగలిగింది. దీనికోసం తీసుకున్న విధానాలేంటి అనే విషయాల్లోకి వెళితే.. చైనా తీసుకున్న కొన్ని విధానాల వల్లే కాలుష్యం తీవ్రస్థాయిలో తగ్గింది. ఒకటి వాయు కాలుష్య నివారణ, నియంత్రణ కార్యాచరణ ప్రణాళిక, నీలి ఆకాశ రక్షణ ప్రచారం (బ్లూ స్కై ప్రొటెక్షన్ క్యాంపెయిన్). ఇంధనం, రవాణా, పరిశ్రమలు ఇలా కీలక రంగాల్లో టాప్ టు బోటమ్ వరకు అన్ని విషయాలపై చైనా దృష్టి సారించింది. అలాగే స్థిరమైన విధానం, కఠినమైన అమలు, ప్రాంతీయ సమన్వయం అనే మూడు అంశాలను బీజింగ్ వ్యూహాలుగా ఎంచుకుంది. కాలుష్య కారక వందలాది పరిశ్రమలను మూసివేయడమో లేక అవసరమనుకున్న కంపెనీలను వేరోచోటకు మార్చడమో ప్రభుత్వ లక్ష్యంగా ఎంచుకుంది. అలాగే వేలాది బొగ్గు ఆధారిత బాయిలర్లను సహజ వాయువుతో భర్తీ చేసింది. చైనా వాహన ఉద్గార ప్రమాణాలను కఠినంగా విధించింది. ఉద్గార ప్రమాణాలను పాటించనందుకు భారీగా జరిమానాలను విధించే విధానాన్ని అమలుచేసింది. ఈ విధానం కేవలం రాజధాని బీజింగ్‌లో మాత్రమే.. పొరుగున ఉన్న టియాంజిన్-హెబీ ప్రావిన్సులలో కూడా ఈ విధానాన్ని కఠినంగా అమలు చేసింది. ఎయిర్‌షెడ్ వ్యూహం ద్వారా వాయుకాలుష్యాన్ని నియంత్రించేలా చేసింది. అనారోగ్యానికి దారితీసే 'పూర్' ఎయిర్ క్వాలిటీ నుంచి.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించిన ఆరోగ్యకర పిఎం2.5 స్థాయికి చేరుకుంది. ఇదంతా 2013 నుంచి 2024 వరకు చేసిన విధానాల వల్లే ఇది సాధ్యమైంది. భారత్ పర్యావరణ చట్టాలు ఉన్నా.. వాటిని కఠినంగా అమలు చేయకపోవడం వల్లే కాలుష్యం పెరిగింది. 1981 నాటి వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం, 1986 పర్యావరణ, పరిరక్షణ చట్టం, వ్యర్థాలు, నిర్మాణం, ఉద్గారాలను నియంత్రించే నియమాలు, కోర్టులు, ట్రిబ్యునళ్లు, కాలుష్య నియంత్రణ బోర్డులతోపాటు, బలమైన చట్టబద్ధమైన చట్రం ఉంది.




# నాలుగో టెస్టులో ఇంగ్లాండ్ ఘన విజయం



యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. ఆసీస్ గడ్డపై దాదాపు 15 ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ ఈ విజయాన్ని నమోదు చేయడం గమనార్హం. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్.. ఈ నామమాత్రపు మ్యాచుల్లో గెలిచి పరువు కాపాడుకోవాలని బరిలోకి దిగింది. ఇంతలోనే నూసాలో ఆటగాళ్లు మద్యం మత్తులో ఉన్న వీడియోలు వైరల్ అవ్వడం.. సిరస్ కోల్పోయామన్న ఒత్తిడి.. వీటన్నంటి నడుమ ఇంగ్లండ్ ఎట్టకేలకు విజయం సాధించింది. అయితే మ్యాచ్ అనంతరం తమ ఈ చారిత్రక విజయంపై కెప్టెన్ బెన్ స్టోక్స్ మాట్లాడాడు. 'ఇది మా అందరి విజయం. ఫలితం మాకు అనుకూలంగా రావడం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోంది. మేము మా కోసం మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల కోసం ఆడుతున్నాం. స్టేడియానికి వచ్చి అభిమానులు ఇచ్చే ప్రోత్సహం మాకు ఎంతో శక్తినిస్తాయి. మ్యాచ్‌కు మాపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. అయినా ఆటగాళ్లు ఎవ్వరూ దృష్టిని చెదరకుండా ప్రదర్శన ఇచ్చారు. ఇదేమీ సులువైన ఛేజ్ కాదు. ప్రశాంతంగా ఆడుతూ బౌలర్లపై ఒత్తిడి తీసుకురావాలనుకున్నాం. అదే చేశాం. ఫలితం సానుకూలంగా వచ్చింది' అని స్టోక్స్ వెల్లడించాడు. పేసర్ జోష్ టంగ్ (5/45, 2/44) అద్భుతమైన ప్రదర్శక చేశాడు. ఛేదనలో బెథెల్ 40 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 'బాక్సింగ్ డే టెస్టులో ప్రేక్షకుల ముందు ఐదు వికెట్లు తీయడం విశేషం. టంగ్ జెర్సీ ధరించిన ప్రతిసారి తన శక్తిని మించిన ప్రదర్శన చేస్తాడు. బెథెల్ వంటి యువ ఆటగాళ్లు ఇలాంటి క్షణాల్లో ముందుకొచ్చి ఆడటం ఆనందంగా ఉంది' అని స్టోక్స్ వివరించాడు.

# శ్రీలంకపై భారత్ మహిళల జట్టు విజయం

## సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్



శ్రీలంక మహిళలతో ఐదు టీ20ల సిరీసను భారత్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సొంతం చేసుకుంది. ఇక్కడ జరిగిన మూడో టీ20లో ఎనిమిది వికెట్లతో హర్మన్ సేన ఘన విజయం సాధించింది. భారత బౌలర్లు విజృంభించిన వేళ తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 112/7 స్కోరుకే పరిమితమైంది. ఇమేషా దులానీ (27), హాసినీ పెరీరా (25), కవిషా దిల్హారీ (20) మోస్తరుగా ఆడారు. ఏడాది తర్వాత టీ20ల బరిలో దిగిన రేణుకా సింగ్ (4/21) స్వింగ్ బౌలింగ్‌తో అదరగొట్టింది. దీప్తీశర్మ (3/18) మూడు వికెట్లు పడగొట్టింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో 115/2తోఛేదించింది. షఫాలీ వర్మ (42 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 79 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరిసింది. కవిషా దిల్హారీ రెండు వికెట్లు కైవసం చేసుకుంది. రేణుకా సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

షఫాలీ ఆడేసింది: ఈ మ్యాచ్‌లోనూ షఫాలీ వర్మ శ్రీలంక బౌలర్లను ఆడేసుకుంది. మంధాన (1), జెమీమా (9) విఫలమైనా కెప్టెన్ హర్మన్ (21 నాటౌట్) జతగా జట్టును సునాయాసంగా విజయ తీరాలకు చేర్చింది. స్పిన్నర్ నిమష వేసిన ఐదో ఓవర్లో 4,4,6,4తో షఫాలీ కదం తొక్కింది. అదే జోరులో 24 బంతుల్లోనే సిరీసలో వరుసగా రెండో హాఫ్ సెంచరీ పూరించింది. హర్మన్‌తో కలిసి మూడో వికెట్‌కు అభేద్యంగా 48 పరుగులు జోడించిన షఫాలీ..షఫానీ బౌలింగ్‌లో ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించింది.

బౌలర్ల జోరు: శ్రీలంక ఇన్నింగ్స్ ధాటిగానే ప్రారంభమైనా..భారత బౌలర్ల విజృంభణతో కుదుపులకు లోనైంది. మధ్య ఓవర్లలో ఇమేషా, కవిష ఆదుకోవడంతో స్కోరు సెంచరీ దాటింది. రేణుకా సింగ్, దీప్తీశర్మ దాటికి శ్రీలంక 45/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. క్రాంతి గౌడ్ వేసిన 13వ ఓవర్లో ఇమేషా దులానీ 4, కవిషా దిల్హారీ 6 బాదడంతో శ్రీలంకకు 14 పరుగులు లభించాయి. కుదురుకుంటున్న ఈ జోడీ నుంచి దిల్హారీని క్యాచవుట్ చేసిన దీప్తి ప్రత్యర్థికి మరోసారి షాకిచ్చింది. దాంతో 40 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఇక.. 16వ ఓవర్లో దులానీని కూడా రేణుక పెవిలియన్ చేర్చగా, 18వ ఓవర్లో మల్షాను దీప్తి బౌల్డ్ చేసింది. చివరి రెండు ఓవర్లలో కౌషిని (19 నాటౌట్) ఒక్కో ఫోర్ కొట్టడంతో శ్రీలంక ఓ మోస్తరు స్కోరు సాధించింది.




# విభిన్నమైన పాత్రలు చేస్తా రష్మిక మందన్న

ఒక నటిగా తాను ఏ పాత్రనైనా చేయగలననే నమ్మకం ప్రేక్షకుల్లో కలగాలని కోరుకుంటున్నానని నటి రష్మిక మందన్న చెప్పారు. 'ఛావా', 'కుబేర', 'ది గర్ల్ ఫ్రెండ్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ఈ ఏడాదిని విజయవంతంగా ముగించిన ఆమె, వరుస సినిమాలతో కెరీర్ జోరును కొనసాగిస్తున్నారు. త్వరలో 'మైసా' అనే నాయికా ప్రాధాన్య చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఏడాది అనుభవాలు, భవిష్యత్ ప్రయాణం గురించి ఆసక్తికరంగా మాట్లాడారు.



2025 తనకు ఎంతో గర్వంగా అనిపించే సంవత్సరమని చెప్పిన రష్మిక, ప్రతి ఏడాది ఇలాగే ఉంటుందనే గ్యారంటీ లేకపోయినా ఈ సంవత్సరం మాత్రం పూర్తిగా సంతృప్తినిచ్చిందని తెలిపారు. తాను చేసిన పనుల వల్ల కుటుంబం, స్నేహితులు సంతోషంగా ఉండటం తనకు మరింత ఆనందాన్ని ఇచ్చిందని, ప్రేక్షకుల నుంచి లభించిన ప్రేమ తనకు గొప్ప బహుమతిగా భావిస్తున్నానని పేర్కొన్నారు.తాను ముందుగా ఒక నటిని, ఎంటర్‌టైనర్‌ని అనే విషయాన్ని ఎప్పుడూ మర్చిపోనని చెప్పిన రష్మిక, ఒకే ఇమేజ్‌లో ఇరుక్కోకుండా విభిన్నమైన పాత్రలు చేయాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. తనను కేవలం మంచి అమ్మాయి లేదా అమాయక పాత్రలకే పరిమితం చేయకుండా, నటిగా ఎదుగుతున్న వ్యక్తిగా ప్రేక్షకులు చూడాలని ఆశిస్తున్నానని చెప్పారు. అందుకే కథ నచ్చితే దర్శకులు, రచయితలపై పూర్తి నమ్మకంతో పని చేస్తానని స్పష్టం చేశారు.

భాషతో సంబంధం లేకుండా పనిచేయడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపిన ఆమె, కన్నడ, తెలుగు, తమిళ, హిందీ పరిశ్రమలను సమాన గౌరవంతో చూస్తానని చెప్పారు. ఏ సినిమా అంగీకరించినా వంద శాతం అంకితభావంతో పనిచేస్తానని, ప్రతి పరిశ్రమలోనూ అద్భుతమైన బృందాలతో కలిసి పనిచేయడం తన అదృష్టమని పేర్కొన్నారు.

తన ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే సంతోషంగా ఉందని చెప్పిన రష్మిక, జీవిత అనుభవాల నుంచే ప్రతిదీ నేర్చుకున్నానని తెలిపారు. చిన్ననాటి నుంచి ఆందోళన, అభద్రతలతో పోరాడినా, వాటిని అధిగమిస్తూ నెమ్మదిగా ముందుకు సాగానని పేర్కొన్నారు. ఈ మార్పులు ఇతరులకు చిన్నవిగా అనిపించినా, తనకు మాత్రం అవి గొప్ప విజయాలేనని భావిస్తున్నానని రష్మిక చెప్పారు.

# సల్మాన్ ఖాన్‌కు బర్త్ డే విషెస్ తెలిపిన మెగాస్టార్ చిరంజీవి



బాలీవుడ్ కండల వీరుడు, స్టార్ హీరో సల్మాన్ ఖాన్ నేడు (డిసెంబరు 27) తన 60వ పుట్టినరోజు జరుపు కుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ఆయనకు సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "నా ప్రియమైన సోదరుడు సల్మాన్ ఖాన్‌కు 60వ పుట్టినరోజు శుభాకాంక్షలు. సల్లూ భాయ్.. ఈ ఏడాది మీకు అంతులేని ఆనందాన్ని, మంచి ఆరోగ్యాన్ని, మీరు అర్హులైన ప్రేమను అందించాలని కోరుకుంటున్నాను. మీరు తెరపై లక్షలాది మందికే కాదు, మాలాంటి స్నేహితులకు కూడా స్ఫూర్తిగా నిలిచారు. మరెన్నో ఏళ్లు మీరు సంతోషంగా ఉండాలి... మరెన్నో విజయాలు అందుకోవాలి" అని చిరంజీవి తన పోస్టులో పేర్కొన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా సల్మాన్ తన పుట్టినరోజు వేడుకలను పన్వేల్‌లోని ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు క్రికెటర్ ఎంఎస్ ధోనీ తన కుటుంబంతో పాటు, సంజయ్ దత్, టబు, కరిష్మా కపూర్, ఆదిత్య రాయ్ కపూర్, హ్యూమా ఖురేషి వంటి ఎందరో సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. సల్మాన్ తన మేనకోడలు అయత్‌తో కలిసి కేక్ కట్ చేశారు. అయత్ పుట్టినరోజు కూడా ఇదే రోజు కావడం విశేషం. అనంతరం సల్మాన్ ఫామ్‌హౌస్ బయటకు వచ్చి, తన కోసం ఎదురుచూస్తున్న మీడియా ప్రతినిధులతో కలిసి క్రిస్మస్ థీమ్‌తో ఉన్న మరో కేక్‌ను కట్ చేసి వారికి పంచిపెట్టారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కత్రినా కైఫ్, ఆయన బాడీగార్డ్ షేరా వంటి వారు ఎమోషనల్ పోస్టులు పెట్టారు. ఈ సందర్భంగా సల్మాన్‌కు గౌరవ సూచకంగా ముంబైలోని బాంద్రా-వర్లీ సీ లింక్‌ను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






# ఓటీటీకి వచ్చేసిన కీర్తి సురేశ్ మూవీ!



కీర్తి సురేశ్ కి తమిళ .. తెలుగు భాషల్లో మంచి క్రేజ్ ఉంది. అందువలన తమిళంలో ఆమె చేసిన సినిమాలు, తెలుగులోనూ విడుదలవుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో తమిళంలో ఆమె చేసిన సినిమానే 'రివాల్వర్ రీటా'. చంద్రు దర్శకత్వం వహించిన ఈ సినిమా, నవంబర్ 28వ తేదీన థియేటర్లకు వచ్చింది. క్రైమ్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమా, తెలుగులోనూ విడుదలైంది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ తెరపైకి వచ్చేసింది. తమిళ .. తెలుగు భాషలతో పాటు, ఇతర భాషలలోనూ ఈ సినిమా ఓటీటీ ఆడియన్స్ ను పలకరించింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను 'నెట్ ఫ్లిక్స్'వారు సొంతం చేసుకున్నారు. ఈ రోజు నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ కి తీసుకొచ్చారు. కీర్తి సురేశ్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాలో, రాధిక .. సునీల్ .. అజయ్ ఘోష్ కీలకమైన పాత్రలను పోషించారు.

ఈ కథ విషయానికి వస్తే, పాండ్యన్ తిరుగులేని నాయకుడిగా నేర సామ్రాజ్యాన్ని పాలిస్తూ ఉంటాడు. తన సోదరుడిని హత్య చేసిన పాండ్యన్ ను అంతం చేయాలనే ప్రతీకారంతో నర్సింహా రెడ్డి ఉంటాడు. అందుకోసం మార్టిన్ ముఠాతో డీల్ కుదుర్చుకుంటాడు. అయితే ఈ లోగానే రీటా తల్లి కారణంగా పాండ్యన్ మరణిస్తాడు. ఫలితంగా రీటా .. ఆమె తల్లి ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనేది కథ.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**